సాక్షి అనంతపురం

సోమవారం । 1 । జనవరి । 2024



టమాట కిలో రూ.18

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



చాంపియన్స్ రాప్తాడు, నార్పల

అనంతపురం ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) క్రికెట్ టోర్నీ చాంపియన్లుగా రాప్తాడు (బాలికలు), నార్పల (బాలుర) జట్లు నిలిచాయి.

IIలో

గరిష్టం/కనిష్టం

34.1°/ 14.9°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

నూతన సంవత్సర శుభాకాంక్షలు



మంత్రి ఉషశ్రీ చరణ్



కలెక్టర్ గౌతమి

కళ్యాణదుర్గం రూరల్/అనంతపురం అర్బన్/క్రైం: జిల్లా ప్రజలకు మంత్రి ఉషశ్రీచరణ్, కలెక్టర్ గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త ఆశయాలు, సరికొత్త ఆలోచనలతో సమష్టిగా కృషి చేసి జిల్లాను ప్రగతి పథంలో నడిపిద్దామని పిలుపునిచ్చారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ఫలాలను అర్హుల దరిచేర్చేందుకు చిత్తశుద్ధితో కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. అందరి సహకారంతో లక్ష్యాలను పూర్తి చేసుకుని జిల్లాను అన్నిరంగాల్లో అగ్రస్థానంలో నిలుపుదామన్నారు.

- అనంతపురం రేంజ్ పరిధిలోని అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాల ప్రజలకు డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ప్రశాంతంగా జీవించాలని ఆకాంక్షించారు.

నేడు 'స్పందన' రద్దు

అనంతపురం అర్బన్ : నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో 'స్పందన' కార్యక్రమం రద్దు చేసినట్లు డీఆర్‌ఓ గాయత్రీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయన్ని గమనించాలని ఆమె సూచించారు.

వేడుకలకు పటిష్ట బందోబస్తు

- సాయంత్రం నుంచే రోడ్లపైకి పోలీసులు
- డ్రంకన్ డ్రైవ్‌పై ప్రధాన దృష్టి



అనంతపురం రూరల్ పరిధిలో వాహనాల తనిఖీ చేస్తున్న డీఎస్పీ బి.వి శివారెడ్డి

అనంతపురం క్రైం : నూతన సంవత్సర వేడుకల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు. ఆదివారం సాయంత్రం నుంచే జిల్లా వ్యాప్తంగా సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బందితో పాటు ఉన్నతాధికారుల పర్యవేక్షణలో రహదారులపైకి చేరారు. పటిష్ట బందోబస్తు నిర్వహించారు. కర్ణాటక మద్యం, నాటుసారా, గుట్కా అక్రమంగా తరలించకుండా వాహనాల తనిఖీ చేపట్టారు. డ్రంకన్ డ్రైవ్‌పై ప్రధాన దృష్టి సారించారు. విచక్షణ రహితంగా వాహనాలు నడిపి ప్రాణాలకు ముప్పు తెచ్చుకోవద్దని పోలీసులు యువతకు సూచించారు. రహదారులు, పబ్లిక్ స్థలాలలో వేడుకలు జరపకుండా గస్తీ ముమ్మరం చేశారు. రోడ్లపై మద్యం సేవించడం, వీధుల్లో నడుస్తూ, బైక్స్‌పై తిరుగుతూ ఇతరులను ఇబ్బంది పెట్టే విధంగా మాట్లాడడం, కామెంట్ చేయకుండా నిఘా వేశారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే విధంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ అన్బురాజన్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

5న జెడ్పీ సర్వసభ్య సమావేశం

అనంతపురం సిటీ: ఉమ్మడి జెడ్పీ సర్వసభ్య సమావేశం ఈ నెల 5న అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన ప్రారంభమయ్యే సమావేశానికి మంత్రి ఉషశ్రీచరణ్, విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీ, కో–ఆప్షన్ సభ్యులు, ఎంపీపీలు హాజరు కానున్నారు. గత సమావేశంలో చర్చించిన అంశాలకు సంబంధించి తీసుకున్న చర్యలు, చేపట్టబోయే అభివృద్ధి పనులకు సంబంధించిన సమగ్ర వివరాలతో హాజరు కావాలని జెడ్పీ అధికారులు అన్ని శాఖల అధికారులను కోరారు. ఈ మేరకు ప్రజాప్రతినిధులకు, అధికారులకు సమాచారం పంపారు.

ప్రశాంతంగా ఏహెచ్‌ఏ ఎంపిక పరీక్ష

అనంతపురం అగ్రికల్చర్: అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ (ఏహెచ్‌ఏ) ఎంపిక పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగినట్లు పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఏడు కేంద్రాల్లో 473 పోస్టులకు ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ పరీక్షకు 925 మంది అభ్యర్థులకు గాను ఏడుగురు గైర్హాజరయ్యారన్నారు. త్వరలోనే ఉమ్మడి జిల్లా పరిధిలో ఏహెచ్‌ఏ పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

• నూతన వసంతం

ఉరిమే ఉత్సాహం.. ఉరకలెత్తే ఆనందం.. నూతన ఆంగ్ల సంవత్సర ఆగమనం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. బాణసంచా వెలుగుల జిలుగులు అంబరాన్నంటాయి. కోటి ఆశలతో నవ వసంతానికి 'అనంత' ఘన స్వాగతం పలికింది. యువతీ యువకులు కేక్‌లు, కాక్‌టెయిల్ విందు, డప్పులు, డీజే వాయిద్యాల నడుమ న్యూ ఇయర్‌కు గ్రాండ్ వెలకమ్ పలికారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియాలో శుభాకాంక్షలతో హోరెత్తించారు. అనంతపురంలోని కమలానగర్, సప్తగిరి సర్కిల్, టవర్‌క్లాక్ వద్ద యువత సంబరాలు ఘనంగా సాగాయి. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలు అవగానే 2023కు వీడ్కోలు పలికి.. 2024 సంవత్సరానికి ఆత్మీయంగా స్వాగతం పలికారు. హ్యాపీ న్యూ ఇయర్ అంటూ కేకలు వేసి సందడి చేశారు. కేకు కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకొన్నారు.

– అనంతపురం కల్చరల్:





అనంతపురం క్లాక్‌టవర్ వద్ద ఆదివారం అర్ధరాత్రి యువత హ్యాపీ న్యూ ఇయర్ సందడి



అనంతపురంలో కొత్తగా నిర్మించిన టవర్‌క్లాక్ బ్రిడ్జి



శ్రీసత్యసాయి జిల్లా పాలసముద్రం వద్ద ఏర్పాటైన నాసిన్ అకాడమీ

ప్రగతి పరుగులు

- గడిచిన నాలుగున్నరేళ్లలో ఉమ్మడి జిల్లాకు భారీ ప్రాజెక్టులు
- రూ.3వేల కోట్లతో కొనసాగుతున్న జాతీయ రహదారి ప్రాజెక్టులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: గడిచిన నాలుగున్నరేళ్లలో ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధికి చిరునామాగా నిలిచింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా భారీ ప్రాజెక్టులు చేపట్టిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందని జిల్లా వాసులు అభిప్రాయ పడుతున్నారు.

శ్రీసత్యసాయి జిల్లాలో నాసిన్..

దేశంలోనే అత్యున్నత సంస్థగా పేరుగాంచిన నాసిన్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్) పనులు పాలసముద్రం దగ్గర 95 శాతం పూర్తయ్యాయి. ఇక్కడ దేశవ్యాప్తంగా సివిల్స్‌లో ఎంపికయ్యే ఐఆర్ఎస్ (ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్) అభ్యర్థులకు శిక్షణ ఇస్తారు. ఏపీ ప్రభుత్వం ఈ సంస్థకు 500 ఎకరాల స్థలం కేటాయించింది. రూ.600 కోట్లతో సంస్థను ఏర్పాటు చేశారు. దీనివల్ల ఈ ప్రాంతంలోని భూములకు భారీగా ధరలు పలకడంతో పాటు ఉద్యోగావకాశాలు రానున్నాయి.

పెనుకొండకు మెడికల్ కాలేజీ..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెనుకొండకు వెనుకబడిన ప్రాంతంగా పేరుంది. అందుకే ప్రభుత్వం మెడికల్ కాలేజీని రూ.375 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తోంది. ఈ కాలేజీ వల్ల చుట్టుపక్కల ప్రాంతాలకు మెరుగైన స్పెషాలిటీ వైద్యం అందడమే కాకుండా 100 ఎంబీబీఎస్ సీట్లుకూడా రానున్నాయి. మరో రెండేళ్లలో ఈ కళాశాల అందుబాటులోకి రానుంది.

ఉమ్మడి జిల్లాలో ఈ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులు			
కేటగిరీ	ప్రాజెక్టు పేరు	వ్యయం	పనుల స్టేటస్
రోడ్డు-బ్రిడ్జి	టవర్‌క్లాక్ బ్రిడ్జి (అనంతపురం)	రూ.319 కోట్లు	పూర్తి
రోడ్డు విస్తరణ	గుత్తి రోడ్డు (అనంతపురం)	రూ.90 కోట్లు	పూర్తి
జాతీయ రహదారి	అనంత-ముచ్చుకోట	రూ.676 కోట్లు	ఆన్‌గోయింగ్
జాతీయ రహదారి	ముచ్చుకోట-తాడిపత్రి	రూ.750 కోట్లు	ఆన్‌గోయింగ్
కేంద్ర శిక్షణ కేంద్రం	నాసిన్	రూ.600 కోట్లు	95 శాతం
విద్యుత్ ప్రాజెక్టు	నాయనిపల్లి హైడ్రో ప్రాజెక్టు	రూ.4,676.64 కోట్లు	ప్రాథమిక దశ
పరిశ్రమలు	ఎంఎస్ఎంఈ	రూ.836 కోట్లు	ఇన్వెస్ట్ పూర్తి
పరిశ్రమలు	ఎంఎస్ఎంఈ ఉద్యోగాలు	33,556	పూర్తి
మెడికల్	పెనుకొండ ప్రభుత్వ వైద్య కళాశాల	రూ.375 కోట్లు	ఆన్‌గోయింగ్

తీరిన అనంత కష్టాలు..

అనంతపురంలో ఏళ్లుగా టవర్‌క్లాక్ బ్రిడ్జి పెద్ద సమస్యగా ఉండేది. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎవరూ పట్టించుకోలేదు. టవర్‌క్లాక్ బ్రిడ్జితో పాటు పంగల్ రోడ్డు వరకూ 9 కిలోమీటర్ల పైన రోడ్డు రూ.319 కోట్లతో గడువుకుముందే పూర్తిచేసి సర్కారు రికార్డు సృష్టించింది. అంతేకాదు 5 కిలోమీటర్ల పొడవునా గుత్తిరోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసి అనంతపురం ప్రజల చిరకాల వాంఛ నెరవేరేలా చేసింది.

800 మెగావాట్లతో హైడ్రో ప్రాజెక్టు..

శింగనమల నియోజకవర్గం నాయనిపల్లి క్రాస్ దగ్గర భారీ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం స్థాపిస్తున్నారు. ఇటీవలే ప్రజాభిసేకరణ పూర్తయ్యింది. 480.65 హెక్టార్లలో ఏర్పాటయ్యే ఈ ప్రాజెక్టుకు రూ.4,676.64 కోట్ల వ్యయం చేస్తున్నారు. ప్రాజెక్టు ద్వారా విద్యుత్ ఉత్పత్తితో పాటు సాగు, తాగునీరు కొదువ లేకుండా ఉంటుంది. రెండేళ్లలో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలనే సంకల్పంతో ఉన్నారు.

శ్రీసత్యసాయి జిల్లాలో వెల్లువలా పరిశ్రమలు..

శ్రీసత్యసాయి జిల్లాలో పరిశ్రమలు వెల్లువలా వచ్చాయి. ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలతో వేలాదిమందికి ఉపాధి లభించింది. గడిచిన నాలుగేళ్లలో 8,997 ఎంఎస్ఎంఈలు (పరిశ్రమలు) ఏర్పాటయ్యాయి. దీనిద్వారా రూ.836 కోట్ల పెట్టుబడులు రాగా, 33 వేల మందికి పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి. దీంతో పాటు మరో 21 భారీ, మధ్యతరహా పరిశ్రమలూ వచ్చాయి.

కోటి ఆశల కొత్త ఏడాది

- చిన్న చిన్న కోరికలతో ఇష్టదైవాలకు జనం వేడుకోలు
- వీసాలు, ఉద్యోగాలు, పిల్లల పెళ్లిళ్లకు తొలి ప్రాధాన్యత
- ప్రకృతి కరుణిస్తే చాలంటున్న అన్నదాతలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కొత్త సంవత్సరం అంటేనే హడావిడి. ఆంగ్ల సంవత్సరం ఆరంభమవుతున్న వేళ కుర్రాళ్ల బైకుల హోరు అదిరిపోయింది. రోడ్లన్నీ కేకలు, ఈలలతో మోగిపోయింది. అర్ధరాత్రి 12 దాటగానే కేకులు కట్ చేసి సందడి చేశారు. ఇవన్నీ ఒకెత్తయితే.... ఈ ఏడాదైనా మాకు అంతా మంచి జరగాలని కోరుకునే వారు కోకొల్లలు. అసలే పెళ్లిళ్లు కాక వయసు మీద పడుతున్న కుర్రాళ్ల సంఖ్య జిల్లాలో పెరిగింది. వీళ్లకు కల్యాణ ఘడియలు వచ్చేలా చూడు స్వామి అంటూ ప్రార్థించే తల్లిదండ్రులు ఎందరో. ప్రపంచం చిన్నదైంది. సర్కారు సాయంతో విదేశీ చదువుల దూరాన్ని మరింత దగ్గర చేశాయి. కొత్త ఏడాదిలో వీసా ఇబ్బంది లేకుండా చూడు స్వామీ అంటూ కుటుంబ సమేతంగా దేవునితో చిన్న చిన్న విన్నపాలు చేసుకునే కుటుంబాలు లేకపోలేదు. అమెరికాలో అసలే మార్కెట్ బాగలేదు.. మా అబ్బాయికి కోర్సు పూర్తయింది..హెచ్1 బి వీసా వచ్చే ఉద్యోగం ఇప్పిస్తే మీకు మొక్కులు తీర్చుకుంటామంటూ చిలుకూరు బాలాజీ వరకూ వెళ్లే వాళ్లు పెరుగుతున్నారు. నిట్‌లూ..ఐఐటీల్లో సీట్లు రావాలని కళ్లకు ఒత్తులేసుకుని చదివే విద్యార్థులను ఆ దేవుడు చల్లగా చూడాలని కోరుకునే అమ్మానాన్నలు ఒకరా ఇద్దరా.. ఆవేశపడే కొడుకు.. అలిగి వెళ్లిన కోడలు.. వీళ్లిద్దరి మధ్య సఖ్యత అనే వారధి కట్టి కాపురం కలకాలం నిలిచేలా చూడు స్వామీ అని ఆశపడేవాళ్లూ లేకపోలేదు. పండ్లు.. కూరగాయలు, మెట్టపంటలకు పుట్టినిల్లు అయిన ఉమ్మడి అనంతపురం జిల్లాలో కొత్త ఏడాది కూడా కరుణ చూపాలని వరుణుడిని చిన్న చిన్న కోరికలతోనే సరిపెట్టుకునే పెద్ద మనసున్న రైతన్నలు లక్షల్లో ఉన్నారు.



- అర్ధరాత్రి 'ట్రాఫిక్ జామ్'లో ఇరుక్కుపోయిన మొబైల్ ఫోన్‌లు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. అర్ధరాత్రి నుంచి శరపరంపరగా వచ్చిన మెసేజ్‌లకు ఒక్కొక్కరే ప్రతి స్పందిస్తున్నారు. కొత్త కుర్రకారు కదా..వాట్సాప్..ఫేస్‌బుక్‌లు ఎప్పుడో దాటేసి లింక్‌డిన్, ఇన్‌స్టాగ్రామ్‌ల వరకూ వచ్చారు. వాటిలో వచ్చిన మెసేజ్‌లకు తాపీగా జవాబిస్తున్నారు. ఏది ఏమైతేనేం.. తన ఆటవెలదిని ఈటెల్లా చేసి శతకోటి మందిని ఆలోచింపచేసిన వేమన పుట్టిన గడ్డ..జనాన్ని భక్తి ప్రపత్తుల్లో ముంచెత్తిన సత్యసాయి బాబా నడయాడిన నేల.. వీరభద్రుడు, నెట్టికంటుడు కరుణా కటాక్షాలున్న ఉమ్మడి అనంత గడ్డలో 44 లక్షల మంది కొత్త సంవత్సరం రోజున చిన్న చిన్న కోరికలు కోరుకోవడంలో తప్పేమీ లేదు. ఆ దేవుడు చల్లగా కరుణిస్తే.. అమ్మఒడి, రైతుభరోసా, విద్యాదీవెన వంటివన్నీ అదనపు బలం!

సంతోషం పెంచే వేళ

- ఈ నెల నుంచే రూ.3వేల పింఛన్ పంపిణీ
- రేపటి నుంచి వారోత్సవాలు



అనంతపురం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి హామీల అమలులో మరో కీలక ఘట్టం పింఛన్ పెంపు జనవరి నుంచి అమలులోకి రానుంది. జిల్లాలో వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, దివ్యాంగులు, చేనేత, అనారోగ్య, సంప్రదాయ వృత్తి, డప్పు కళాకారులు, కిడ్నీ బాధితులు, మత్స్యకారులు, అభయహస్తం, కల్లుగీత కార్మికులు, ట్రాన్స్‌జెండర్, కళాకారులు, సైనిక్ వెల్ఫేర్ పింఛన్లు 2,86,426 మందికి అందిస్తున్నారు. వీరికి కేటగిరీని బట్టి రూ.2,750 నుంచి రూ.3వేలు, రూ.5వేలు, రూ.10వేల పింఛన్ చొప్పున ప్రతి నెలా రూ.80.078 కోట్లు ఖర్చు చేస్తున్నారు. తాజాగా వృద్ధాప్య, వితంతు, ఒంటరి, వివిధ చేతివృత్తుల వారి పింఛన్ రూ.2,750 నుంచి రూ.3వేలకు పెరిగింది. పెరిగిన పింఛన్‌తో ఈ నెల నుంచి మొత్తం రూ.85 కోట్లకు చేరింది.

- రెండో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు పింఛన్ పెంపు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ ఐ.నరసింహారెడ్డి తెలిపారు. మూడో తేదీ జిల్లాస్థాయి సదస్సుతో పాటు పింఛన్ పంపిణీ ఉంటుంది.
- కొత్తగా పింఛన్ కోసం దరఖాస్తుచేసుకున్న వారిలో అర్హుల ఎంపిక జరుగుతోంది. నాలుగు రోజుల్లో అర్హుల తుది జాబితా పూర్తయితే ఆ లబ్ధిదారులకు కూడా రూ.3వేల పింఛన్ అందించనున్నారు.

ఉరవకొండలో 7న 'సాధికార' యాత్ర



సామాజిక సాధికార యాత్ర వివరాలు వెల్లడిస్తున్న సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి

- బడుగులకు చేసిన మేలును వివరించేందుకే బస్సు యాత్ర
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు జగన్ పాలనలో జరిగిన మేలును వివరించేందుకు చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర ఈ నెల ఏడో తేదీన ఉరవకొండలో జరగనుందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. యాత్ర వివరాలను ఆదివారం ఆయన వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ముఖ్య నేతలతో కలిసి మీడియాకు వెల్లడించారు. ఏడో తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు క్లాక్‌టవర్ వద్ద సామాజిక సాధికార సభ ప్రారంభమవుతుందన్నారు. యాత్రకు ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రులు విడదల రజిని, ఉషశ్రీ చరణ్, కారుమూరు నాగేశ్వరరావు, ఎంపీ నందిగం సురేష్‌తో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతారన్నారు. పాలనలో సీఎం జగన్ చరిత్ర సృష్టించారన్నారు. అన్ని వర్గాల ప్రజలకూ సంతృప్తస్థాయిలో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిని చేకూర్చారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో 32 లక్షలమంది పేదలకు నివేశన స్థలాలు ఇచ్చి, పక్కాగృహాలు మంజూరు చేసిన ఘనత సాధించారన్నారు. కులాల వారీగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, పదవులు కేటాయించి ఉన్నతస్థానంలో నిలిపారన్నారు. రాజకీయ, నామినేటెడ్ పదవుల్లోనూ అన్ని కులాల వారికీ ప్రాతినిధ్యం కల్పించి సామాజిక న్యాయం అమలు చేశారన్నారు. జనరంజక పాలన సాగించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటేనే బడుగులకు తగిన గుర్తింపు, న్యాయం జరుగుతుందన్నారు. బడుగు, బలహీన వర్గాల వారికి ప్రభుత్వం చేసిన మేలును వివరించి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు పలకాలని కోరుతున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనని తెలిపారు. సమావేశంలో ఎంపీపీ నరసింహులు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, పార్టీ పట్టణ అధ్యక్షులు ఏసీ ఎర్రిస్వామి, మార్కెట్ యార్డు చైర్మన్ సుశీలమ్మ, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు తిప్పయ్య, పార్టీ నాయకులు అశోక్, వడ్ల షెక్షావలి, జేసీఎస్ కన్వీనర్ ఆసిఫ్, ఈడిగ ప్రసాద్, వన్నూర్ సాబ్, దాదు, చేనేత విభాగం నాయకులు చెంగల మహేష్, గట్టు ఎర్రిస్వామి, ఎంసీ నాగభూషణం, నిమ్మల వెంకటమరణ, కొత్తపల్లి హరి ఇతర నాయకులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ నాగరాజు, తదితరులు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రధానోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2024 సంవత్సర క్యాలెండర్, డైరీ, హ్యాండ్ బుక్ జిల్లా విద్యాశాఖాధికారి వి.నాగరాజు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థాయిలో నిలపాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓలు ఎ.శ్రీదేవి, కె.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు జయరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలమురళీకృష్ణ, జిల్లా సాధారణ పరీక్షా మండలి కార్యదర్శి పురుషోత్తంబాబు, కోశాధికారి లింగా నాయక్, గౌరవ అధ్యక్షుడు భాస్కరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎల్ చాంపియన్ రాప్తాడు, నార్పల



బాలికల విభాగంలో విజేతగా నిలిచిన రాప్తాడు జట్టు

అనంతపురం: అనంత ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) చాంపియన్‌గా రాప్తాడు(బాలికలు), నార్పల(బాలుర) జట్లు నిలిచాయి. అనంత క్రీడాగ్రామం వేదికగా ఆదివారం జరిగిన బాలికల ఫైనల్ మ్యాచ్‌లో ఎస్ఎస్‌బీఎన్, రాప్తాడు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఎస్ఎస్‌బీఎన్ జట్టు 30 ఓవర్లలో 132 పరుగులు చేసి ఆరు వికెట్లు కోల్పోయింది. కెప్టెన్ కె.గౌతమి 44 బంతుల్లో ఓ ఫోర్‌తో 36 పరుగులు, ఛాయాశ్రీ 47 బంతుల్లో 25 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన రాప్తాడు జట్టు 26.5 ఓవర్లలోనే 133 పరుగులు చేసి చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. జట్టులో ఎ.హన్సిరెడ్డి 68 బంతుల్లో ఓ ఫోర్‌తో 27 పరుగులు, బి.నేహా 33 బంతుల్లో 34 పరుగులు చేశారు. అలాగే బాలుర విభాగంలో నార్పల, రాప్తాడు జట్లు తలపడగా... టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన నార్పల జట్టు 39.4 ఓవర్లలో 130 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులో వై.హర్ష 78 బంతుల్లో 38 పరుగులు, సి.చిరంజీవి 20 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన రాప్తాడు జట్టు 32.5 ఓవర్లలో 99 పరుగుల వద్ద చతికిల పడింది. దీంతో బాలుర చాంపియన్‌షిప్‌ను నార్పల జట్టు గెలుచుకుంది. కాగా, టోర్నీ మొత్తంలో అత్యంత విలువైన ఆటగాళ్లుగా సాత్విక్ (రాప్తాడు), డి.చక్రిక (ఎస్ఎస్‌బీఎన్–అనంతపురం), బెస్ట్ బ్యాటర్లుగా నేహా (రాప్తాడు), ఎం.భువనేశ్వర్ (గుత్తి), బెస్ట్ బౌలర్‌గా ఎ.మాన్విత (రాప్తాడు) అవార్డులు అందుకున్నారు.

ఎంఈఓ-1 అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపిక



మస్తాన్‌రావు



ఓబుళపతి

అనంతపురం ఎడ్యుకేషన్: మండల విద్యాశాఖ అధికారుల (ఎంఈఓ–1) అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సింహాచలం ఆదేశాల మేరకు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయక్ పర్యవేక్షకులుగా వ్యవహరించారు. అధ్యక్షుడిగా మస్తాన్‌రావు (గుంతకల్లు), ప్రధాన కార్యదర్శిగా ఓబులపతి (బ్రహ్మసముద్రం), ట్రెజరర్‌గా శ్రీదేవి (పుట్లూరు), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నరసింహారెడ్డి (ఆత్మకూరు), రాష్ట్ర ప్రతినిధులుగా కాశప్ప(యాడికి), జి.రాముడు (పెద్దవడుగూరు)ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నూతన కార్యవర్గ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు.

జిల్లా తైక్వాండో సంఘం అధ్యక్షుడిగా గోపాలరెడ్డి



గోపాలరెడ్డిని అభినందిస్తున్న దృశ్యం

అనంతపురం: జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడిగా న్యాయవాది గోపాలరెడ్డి ఎంపికయ్యారు. అనంతపురంలో ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎస్.గురుస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శిగా కె.శాంతరాజ్, కోశాధికారిగా సి.సాయితేజ, ఉపాధ్యక్షులుగా పి.బావాజీ, కె.విజయకుమార్, జె.మనీంద్ర, సంయుక్త కార్యదర్శులుగా బి.కేశవయ్య, సి.వెంకటేశులు ఎంపికయ్యారు. ఈ సంఘం 2027 డిసెంబర్ వరకూ అధికారికంగా కొనసాగుతుందని ఈ సందర్భంగా వారు ప్రకటించారు.



రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



మృతుడు శివకుమార్‌గౌడ్

తాడిపత్రి: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు... తాడిపత్రి మున్సిపల్ పరిధిలోని నందలపాడుకు చెందిన శివకుమారగౌడ్ (21) శనివారం రాత్రి వ్యక్తిగత పనిపై తాడిపత్రి నుంచి యర్రగుంట్లకు రైలు ఎక్కి బయలుదేరాడు. మార్గమధ్యంలో యల్లనూరు రోడ్డు లెవల్ క్రాసింగ్ వద్ద ప్రయాణిస్తుండగా డోర్ వద్ద నిలబడిన శివకుమార్ అదుపుతప్పి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం ఉదయం స్థానికుల నుంచి సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ నాగప్ప అక్కడకు చేరుకుని పరిశీలించి, మృతుడిని శివకుమార్‌గౌడ్‌గా గుర్తించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు నాగరాజుగౌడ్, ఓబుళమ్మ అక్కడకు చేరుకుని నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

‘బాధ్యత’కు నంది అవార్డు



అవార్డు అందుకున్న బాల నటులు

అనంతపురం కల్చరల్: ఆరభి యూత్ అండ్ కల్చరల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన బాలల నాటిక ‘బాధ్యత’కు రాష్ట్రస్థాయి నంది అవార్డులు దక్కాయి. వారం రోజుల పాటు గుంటూరు వేదిక రాష్ట్ర చలన చిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నంది నాటకోత్సవాలు జరిగిన విషయం తెలిసిందే. జిల్లాకు చెందిన చిన్నారులు ప్రదర్శించిన బాధ్యత నాటిక రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి కింద నంది అవార్డు (రజతం) దక్కించుకుంది. ఉత్తమ నటుడిగా కుట్టన్‌కు నంది అవార్డు అందజేశారు. రచయిత, దర్శకత్వం వహించిన ఆముదాల సుబ్రహ్మణ్యంకూ అవార్డుతో పాటు నగదు పురస్కారం, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. అలాగే ఇంకెన్నాళ్లు నాటికలో దిశ పాత్రలో నటించిన అనూష... ఉత్తమ బాలనటిగా నంది అవార్డు అందుకున్నారు.







విద్యుదాఘాతంతో మెకానిక్ మృతి



మృతుడు వన్నూరుస్వామి

విడపనకల్లు: విద్యుత్‌షాక్‌కు గురై ఓ మోటార్ మెకానిక్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. విడపనకల్లుకు చెందిన బోయ వన్నూరుస్వామి (25) విద్యుత్ మోటార్ల రిపేరీతో జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం సహాయకుడు దౌలాతో కలసి పెద్దకొట్టాలపల్లిలో విద్యుత్ మోటారుకు మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే స్థానికుల సాయంతో వన్నూరుస్వామిని ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి దౌలా తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై విడపనకల్లు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, మృతుడికి భార్య, ఏడాది వయసున్న కుమారుడు ఉన్నారు.

మహిళను మోసగించి బంగారం అపహరణ

చిలమత్తూరు: ఆధార్ అప్‌డేట్ పేరుతో ఓ మహిళను మోసగించి బంగారాన్ని అపహరించుకెళ్లిన ఘటన సంచలనం రేకెత్తించింది. వివరాలు.. చిలమత్తూరు మండలం రొద్దంవారిపల్లికి ఆదివారం ఉదయం చేరుకున్న ఇద్దరు యువకులు స్థానికంగా నివాసముంటున్న నిడిమామిడమ్మ వద్దకు చేరుకుని తాము జిల్లా కేంద్రం నుంచి వచ్చినట్లు పరిచయం చేసుకున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న నిత్యావసరాల కోసం ఆధార్ కార్డు అప్‌డేట్ చేయాలని, ఇందు కోసం ఫొటో తీసుకుంటామని నమ్మబలికారు. వారి మాటలు నమ్మిన ఆమె ఫొటో దిగేందుకు సిద్ధం కాగానే శరీరంపై బంగారు నగలు ఉంటే రేషన్ అందదని, చెవిలో కమ్మలు తీసి పక్కన పెట్టాలని చెప్పడంతో ఆమె అలాగే తీసి పక్కన పెట్టింది. ఆ సమయంలో ఆమెను ఏమార్చి బంగారు కమ్మలను మరో యువకుడు చేతికి తీసుకుని ద్విచక్ర వాహనాన్ని స్టార్ట్ చేయగానే అప్పటి వరకూ మొబైల్‌లో ఫొటో తీస్తున్నట్లుగా నటించిన యువకుడు పరుగున వెళ్లి కూర్చొన్నాడు. అప్రమత్తమైన ఆమె కేకలు వేసేలోపు అక్కడి నుంచి ఉడాయించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనపై ఆరా తీశారు.



లక్ష ఓట్లతో గెలిచే వాడివి 20 రోజులకే ఎందుకు పారిపోయావ్?

- మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరిపై పరిటాల శ్రీరామ్ ధ్వజం

ధర్మవరం: ‘లక్ష ఓట్లతో గెలుస్తానని ప్రగల్భాలు పలికావ్.. అంత సత్తా ఉన్న వాడివి గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఓడిపోయిన తర్వాత 20 రోజులకే పార్టీని, నమ్ముకున్న కార్యకర్తలను వదిలి వేరే పార్టీలోకి ఎందుకు వెళ్లావ్? రూ.వంద కోట్లతో ఎమ్మెల్యే సీటు కొంటానని అనుచరులతో ప్రచారం చేయిస్తున్నావ్. ఇది నీ అహంకారానికి నిదర్శనం కాదా? గతంలో నీవు చేసిన అవినీతి, అక్రమాల ఫలితంగానే ఓడిపోయావని గుర్తుంచుకో’ అని ధర్మవరం మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరిపై ఆ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ మండిపడ్డారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్మవరం నియోజకవర్గంలో 2009, 2019 ఎన్నికల్లో తాము సూరిని ఓడించామని ఆరోపించారని, తాము సహకరించకపోతే 2014 ఎన్నికల్లో ఎలా గెలిచారని ప్రశ్నించారు. ఓడిపోతే అవతలి వారిపైకి నెట్టడం, గెలిస్తే తన క్రెడిట్ అనడం ఆయనకు పరిపాటిగా మారిందన్నారు. టీడీపీ హయాంలో ఎమ్మెల్యేగా తన అధికారాన్ని అడ్డు పెట్టుకుని రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ధర్మవరం నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా, ఇతర అక్రమాలకు సూరి పాల్పడ్డారన్నారు. ఫలితంగానే 2019 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారన్నారు. ధర్మవరం చెరువుకు నీరందించేందుకు కాలువను రూ.3 కోట్లతో ఎక్కడ నిర్మించారో వరదాపురం చెప్పాలన్నారు.



రేసర్ ఢీకొని సచివాలయ ఉద్యోగి మృతి

- పరస్పరం ఢీకొని ప్రమాదానికి కారణమైన బైక్ రేసర్లు



శ్రీనివాసులు (ఫైల్)


పరిగి: బైక్ రేసర్ల అత్యుత్సాహం ఓ ఉద్యోగి ప్రాణాలు బలిగొంది. వివరాలు... పరిగి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ శ్యామల భర్త శ్రీనివాసులు హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని 23వ సచివాలయంలో వెల్ఫేర్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం తన పోలింగ్ బూత్ విధులను ముగించుకుని పరిగి మండలంలోని కొడిగెనహళ్లి వైపు తన కుమార్తెతో కలసి బైకుపై బయలుదేరారు. సేవామందిరం వద్ద ఉన్న పెన్నానది వంతెన దాటుతున్న సమయంలో వెనుక నుంచి దూసుకువచ్చిన రేసర్ బైక్‌ను ఆ వెనుకే ఉన్న మరో రేసర్ ఢీకొని నేరుగా వెళ్లి శ్రీనివాసులు ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నారు. ఘటనలో కిందపడిన శ్రీనివాసులు అపస్మారక స్థితికి చేరుకున్నారు. స్వల్ప గాయాలతో కుమార్తె బయటపడింది. అటుగా వెళుతున్న వారు వెంటనే శ్రీనివాసులును హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు బెంగళూరుకు కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. ఐసీయూలో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. కాగా, శ్యామల ప్రస్తుతం గర్భిణి. భర్త శ్రీనివాసులు ఇక లేరన్న విషయం తెలిస్తే చాలా ఇబ్బందులు తలెత్తుతాయనే భావనతో ఆయన మృతిని పోలీసులు గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. ప్రమాదానికి కారణమైన రేసర్లలో ఒకరు గాయపడినట్లు సమాచారం. ఘటన చోటు చేసుకున్న వెంటనే తమ ద్విచక్ర వాహనాలతో రేసర్లు అక్కడి నుంచి ఉడాయించారు. ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ప్రాథమికంగా ఫిర్యాదు అందితే ప్రమాదానికి కారణమైన యువకులను విచారించి కేసు నమోదు చేస్తామని ఎస్ఐ నరేంద్ర పేర్కొన్నారు.



పేకాట ఆడుతూ పట్టుబడ్డ తమ్ముళ్లు

పామిడి: పేకాట ఆడుతూ టీడీపీ నేతలు పట్టుబడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... పామిడి మండలం గజరాంపల్లి సమీపంలోని శ్రీనివాస మిల్క్ డెయిరీ ఎదురుగా పొలాల్లో స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్న టీడీపీ నేతలు కొంత కాలంగా అక్కడ పేకాట ఆడసాగారు. విశ్వసనీయ సమాచారంతో ఆదివారం రాత్రి సీఐ రాజశేఖర రెడ్డి నేతృత్వంలో సిబ్బంది ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో పేకాట ఆడుతూ టీడీపీ నేతలు కె.లక్ష్మీకాంతరెడ్డి, జె.సాంబశివా, సి.రామాంజనేయులు, జి.రాజు, జె.పరుశురామ్, జె.శేషారెడ్డి, సి.ప్రసాద్, బి.నారాయణరెడ్డి, వి.ప్రభాకర్, ఎం.రామాంజనేయులు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.30,200 నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, తొమ్మిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పుట్టపర్తిలో విదేశీ కరెన్సీ చోరీ



విదేశీ కరెన్సీ మార్పిడి కేంద్రాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పుట్టపర్తి రూరల్: స్థానిక ఫారిన్ కరెన్సీ మార్పిడి కేంద్రంలో దుండగులు చొరబడి విదేశీ కరెన్సీని అపహరించుకెళ్లారు. వివరాలు... పుట్టపర్తికి చెందిన సాయిబాబా... ప్రశాంతి నిలయం గణేష్ గేట్ సమీపంలో ప్రధాని రహదారి పక్కనే సాయి ఫారెక్స్ పేరుతో విదేశీ నగదు మార్పిడి కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి లావాదేవీలు ముగించుకుని షటర్ దించి తాళం వేసుకుని ఇంటికి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత దుండగులు షట్టర్ తాళాలు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించి రూ.2 లక్షల విలువైన విదేశీ కరెన్సీని అపహరించుకెళ్లారు. ఆదివారం అక్కడకు చేరుకున్న యజమాని సగం షట్టర్ ఎత్తి ఉండడం గమనించి చోరీ జరిగినట్లుగా భావించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

EDUCATION

- 3 నెలల్లో Diploma/ B.Tech/ LLB/ BL/ Part Time - అన్ని Govt. Jobs కు Eligible, Exams-Feb-2024. గ్యారెంటీ పాస్‌కై కృషి. 7995053670, 9550271042. [C-777291]

STUDY HALL

- Single Sitting : 10th, 12th, BA, B.Com, B.Sc, MA, MCom, MSc, MBA, BBA, BCA BTECH, DIPLOMA, AGRICULTURE, PHARMACY, NURSING (for drop outs/ Backlogs) from UGC recognised Universities CALL: 73383 76874. [R-221]

REAL ESTATE

SHOP ROOMS FOR RENT

- ATP న్యూటౌన్, నడిమివంక దగ్గర, బళ్ళారి రోడ్ + కళ్యాణదుర్గం రోడ్డు సర్కిల్‌లో, 4 షాప్ రూములు వ్యాపార వాణిజ్యమునకు / ఆఫీస్‌లకు బాడుగకు కలవు. సెల్ : 9440287215 [A-2784]

WANTED

- మా హోమ్ నందు కేర్ టేకర్స్–మహిళలు & వంట మనుషులుగా స్త్రీలు, సెక్యూరిటీ గార్డ్స్ మా హోమ్ నందే ఉండగల ఫ్యామిలీ కావలెను. మంచి జీతం. # గోల్డెన్ ఓల్డేజ్ హోమ్, ATP. 9010387993. [A-2789]
- ప్రముఖ NGO లో పనిచేయుటకు వాలంటీర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ & కిసాన్ లోన్స్ చేయుటకు యువతి యువకులు కావలెను. ఫోన్ : 9000977523, 8125933546. [A-1510]
- ధర్మవరంలో ప్రముఖ బ్యాంక్‌కు సెక్యూరిటీ గార్డ్స్ అర్జెంట్ గా కావలెను. జీతం:10,500, EPF&ESIC కలవు. ఏజ్:35-45 సం॥ లోపు డ్యూటీ: 8గం॥ సంప్ర: 9381838140. [A-1511]
- Wanted Female Candidates to work in Medical Stores at Anantapur Qua: B.Sc / B.Pharm. Contact:8688679348. [A-1512]
- మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1167576]
- హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీవసతి+భోజనం జీ.18K.ఫోన్: 9640258899/9640468899. [HA-1041]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

నగర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి


ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి


మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు

అనంతపురం కార్పొరేషన్: నగర ప్రజలకు మేయర్ వసీం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం మేయర్ ఓ ప్రకటన విడుదల చేశారు. నగర ప్రజలు నూతన సంవత్సర వేడుకలను సంతోషంగా జరుపుకోవాలన్నారు. నగరాభివృద్ధికి పాలక వర్గం నిరంతరం పనిచేస్తుందన్నారు.

పెద్దవడుగూరు జెడ్పీటీసీకి పరామర్శ


భాస్కర్‌రెడ్డి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్న గిరిజమ్మ

అనంతపురం సిటీ: పెద్దవడగూరు జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డిని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఆదివారం పరామర్శించారు. ఆపరేషన్ చేయించుకొని ఇంటికి చేరుకున్న ఆయన్ను ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని సూచించారు.

ప్రజలందరూ బాగుండాలి..

నూతన సంవత్సరంలో ప్రజలంతా బాగుండాలని జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఆదివారం ఓ ప్రకటనలో ఆకాంక్షించారు. 2024లో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవితం గడపాలని కోరుకున్నారు. అధికారులు సరికొత్త ఉత్సాహంతో లక్ష్య సాధనకు కృషి చేయాలని తెలిపారు.

పేకాట కేంద్రంపై దాడి

అనంతపురం క్రైం: టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని నాయక్ నగర్‌లో ఓ ఇంట్లో రహస్యంగా పేకాట నిర్వహిస్తుండడంతో పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ. 33 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శివరాముడు తెలిపారు.


న్యూ ఇయర్ సందర్భంగా విద్యుత్ దీపాల వెలుగుల్లో టవర్‌క్లాక్




నగరంలో కేకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

కొంగొత్త ఆశలు

నిన్నటితో 2023 సంవత్సరం బైబై చెప్పింది. చేదు అనుభవాలు.. చెదిరిన జ్ఞాపకాలు.. మరుపురాని గురుతులు.. మర్చిపోలేని అనుభూతులు.. కాలంలో కరిగిపోయాయి. మిగిలిపోయిన ఆశయాలను మరింత ఉత్సాహంతో పూర్తి చేయాలని.. కొంగొత్త ఆశలు.. ప్రతి ఒక్కరి జీవితంలో కాంతులు నింపేందుకు 2024 సంవత్సరం హాయ్ హాయ్ చెప్పింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:




దుస్తులు కొనుగోలు చేస్తున్న దృశ్యం




నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని నగరంలో విద్యుత్ అలంకరణ


మున్సిపల్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మేయర్ వసీం తదితరులు


నగరంలో అర్ధరాత్రి నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటున్న యువత

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



రాప్తాడురూరల్: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. కొత్త ఏడాది ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగు నింపాలని, ఆ వెలుగులు ఏడాదంతా ఉండాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

కానుకలేమీ తీసుకురావొద్దు..

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు సోమవారం వచ్చేవారెవరూ బొకేలు, పూలదండలు, బహుమతులు, కేకులు తీసుకురావద్దని ఎమ్మెల్యే కోరారు. ఆప్యాయతతో కూడిన పలకరింపులు చాలు అదే పదివేలు అన్నారు. మధ్యాహ్నం నియోజకవర్గంలోని స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలతో కలిసి సహపంక్తి భోజనం చేస్తానని తెలిపారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జేఎన్‌టీయూఏ వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్, డీఈఓ, డిప్యూటీ డీఈఓలు


అపుస్మా ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ, స్టిక్కర్ క్యాలెండర్‌ను ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ వెంకటరామిరెడ్డి, డీఈఓ నాగరాజు, డెప్యూటీ డీఈఓలు శ్రీనివాసరావు, శ్రీదేవి ఆవిష్కరించారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎస్వీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.రఘురాములు, ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కే కులశేఖర్ రెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవీంద్ర, శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర నాయకులు పీవీ ప్రసాద్, విశ్వనాథ్ రెడ్డి, వెంకటరెడ్డి, మహమ్మద్ రఫీ, సత్యప్రసాద్, జిల్లా గౌరవ అధ్యక్షుడు రామానాయక్ పాల్గొన్నారు.

అనంతపురం: పద్మశాలి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీ, నూతన సంవత్సర కేలండర్‌ను జేఎన్‌టీయూఏ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింక రంగ జనార్దన ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర కోశాధికారి చంద్ర శేఖర్, నాయకులు శివరుద్రప్ప, జిల్లా అధ్యక్షుడు జింక సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శి సురేష్, ట్రెజరర్ ప్రసాద్ పాల్గొన్నారు.

అనంతపురం సెంట్రల్: ది వీరశైవ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూనత క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆదివారం పాతూరు బసవన్నకట్ట గుడిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వీరశైవ విశిష్ట అతిథులుగా జయంత్, వీరశైవ సమాజ అధ్యక్షుడు రాజు, జంగమ సంఘ అధ్యక్షులు తిప్పేస్వామి, ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రవిశంకర్, ప్రధాన కార్యదర్శి ఉమాశంకర్, నాయకులు శాంతకుమార్, ప్రసన్నకుమార్, శివకుమార్, భారతి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) 2024 కేలండర్‌ను డీఈఓ నాగరాజు, అపుస్మా జిల్లా అధ్యక్షుడు కుసుమ పుల్లారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసి విష్ణు ప్రసాద్, రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ రామిరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, రాష్ట్ర కన్వీనర్ నాగరాజు శ్రీనాథ్, జిల్లా కోశాధికారి ఇక్బాల్, శ్రీనాథ్, రవీంద్ర రెడ్డి, రామచంద్రారెడ్డి, అన్వర్, నారాయణ రెడ్డి, సుగుణాకర్, మధుసూధన్ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, జలీల్, లక్ష్మన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు


ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం ఎడ్యుకేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని 'వై ఏపీ నీడ్స్ జగన్' అనే అంశంపై వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి కట్టుబడి తానీషా ఆధ్వర్యంలో గత నెల 10న వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తన నివాసంలో ఆదివారం బహుమతులు అందించారు. మొదటి బహుమతి సుస్మిత (ఉరవకొండ), రెండో బహుమతి సుమిత్రబాయి (అనంతపురం), మూడో బహుమతి ముత్యాలమ్మ (ఆర్ట్స్‌కళాశాల) ఎంపికయ్యారు. వీరితో పాటు మరో 45 మందికి బెస్ట్‌పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందించారు. మొదటి బహుమతిగా రూ. 5 వేలు, రెండో బహుమతిగా రూ. 3 వేలు, మూడో బహుమతిగా రూ. 2 వేలు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ఫయాజ్ బాషా, కళాశాల ప్రిన్సిపాల్ శంకరయ్య, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు సోముశేఖరరెడ్డి, అధ్యాపకులు మల్లిఖార్జున రావు, జూడో ప్లేయర్ కౌసర్ భాను, నూర్, దావూద్, షెక్షావలి, అల్తాఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

'ఎన్‌ఆర్‌ఐ' యాజమాన్యం అండ


విద్యార్థులు, తల్లితో మాట్లాడుతున్న వెన్నపూస విశ్వనాథ్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఆదిమూర్తినగర్‌లోని ఎన్ఆర్ఐ విద్యాసంస్థల యాజమాన్యం ఇద్దరు విద్యార్థులకు అండగా నిలిచింది. గుత్తి మండలం కిష్టిపాడుకు చెందిన గౌరవ్ 7వ తరగతి, శ్రీజ 7 తరగతి చదువుతున్నారు. ఈ విద్యార్థుల తండ్రి 15 రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న విద్యాసంస్థల చైర్మన్ వెన్నపూస విశ్వనాథ్ రెడ్డి బాధిత విద్యార్థుల కుటుంబ పరిస్థితి తెలుసుకొని వారిద్దరినీ ఇంటర్ వరకు ఉచిత విద్య (హాస్టల్ వసతి కల్పి) అందించే బాధ్యత తీసుకున్నారు. ఆదివారం కళాశాలలో ఆ విద్యార్థుల తల్లికి ఉచిత విద్య పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ విద్యా సంస్థల ఎండీ చంటి రెడ్డి, ప్రిన్సిపాళ్లు డాక్టర్ వెంకటసుబ్బయ్య, శ్రీలత చౌదరి, ప్రశాంత్‌నాయక్, రవీంద్ర, అనిల్, గౌతమ్ సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపిక


పరుగు పందెంలో పాల్గొన్న క్రీడాకారులు

అనంతపురం: నగరంలోని నీలం సంజీవరెడ్డి స్టేడియంలో అండర్-14, అండర్-16 జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఆదివారం నిర్వహించారు. 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో ఎంపికైన వారు ఫిబ్రవరి 16,18 తేదీల్లో గుజరాత్‌లో జరగబోవు పోటీల్లో పాల్గొంటారని, అథ్లెటిక్స్ అసోసియేషన్ అడ్‌హాక్ కమిటీ జిల్లా చైర్మన్ డి. ఇస్మాయిల్, కన్వీనర్ డి.రవికుమార్ పేర్కొన్నారు.

నూర్‌బాషా సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఖాసీం


నూతన అధ్యక్షుడిని అభినందిస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: దూదేకుల, నూర్‌బాషా సంక్షేమ సంఘం అధ్యక్షుడు అక్కంపల్లి ఖాసీంను ఎన్నుకున్నారు. ఆదివారం సంఘం గౌరవాధ్యక్షురాలు రమీజాబేగం నివాసంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మహబూబ్ సాహెబ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కాలసర్ప దోష నివారణ పూజలు

అత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాహుకేతు హోమాలతో పాటు కాలసర్ప దోష నివారణ పూజలు నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. స్వామి బంగారు కవచాన్ని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి, మహా మంగళహారతి ఇచ్చారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీదేవికి ప్రత్యేక పూజలు అందించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

సంతల ఆదాయం రూ.3.89 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.3.89 లక్షలకుపైగా ఆదాయం వచ్చినట్లు చైర్మన్ ఫయాజ్ బాషా, సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.2,24,360 వసూలయ్యిందన్నారు. ఆదివారం జరిగిన పశువుల సంత నుంచి రూ.1,65,400 మేర వసూలైనట్లు తెలిపారు.

బేకరీల్లో తనిఖీలు

అనంతపురం క్రైం: నగరంలోని బేకరీలు, స్వీట్స్ దుకాణాలపై లీగల్ మెట్రాలజీ అధికారులు ఆదివారం తనిఖీ చేశారు. ప్యాకేజీ తినుబండారాలపై తయారీదారుడి పూర్తి చిరునామా, తయారైన నెల, సంవత్సరం, వినియోగదారుడు ఫిర్యాదు చేయాల్సిన పేరు,చిరునామా, ఫోన్ నంబర్ తదితర వివరాలు ముద్రించకపోవడంతో జరిమానా విధించారు. అధిక ధరలకు కూల్ డ్రింక్ అమ్ముతున్నందుకు, కేక్‌లు తక్కువ తూకం ఉండడంతో మొత్తం 11 కేసులు నమోదు చేసి, 7 కేసులకు గాను రూ. 60 వేలు జరిమానా విధించారు.

బైకు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు


గాయపడిన మనోహర్

అనంతపురం క్రైం : ద్విచక్రవాహనం ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలయ్యా యి. శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం వేపకుంటకు చెందిన మనోహర్ అనే యువకుడు అనంతపురం శివారు రుద్రంపేట బైపాస్ సమీపాన గల ద్విచక్రవాహ షో రూంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఆదివారం అర్ధ రాత్రి విధి నిర్వహణలో ఉన్న మనోహర్ మూత్రవిసర్జనకు బయటకు రాగానే అతివేగంతో వస్తున్న పల్సర్ బైక్ ఢీకొంది. ఈ ఘటనలో మనోహర్ ముళ్లపొదల్లోకి ఎగిరిపడ్డాడు. ద్విచక్రవాహనదారుడు ఆపకుండా పరారయ్యాడు. కాళ్లకు తీవ్రగాయాలై పడి ఉన్న మనోహర్‌ను స్థానికులు గమనించి 108కు సమాచారమిచ్చారు. అంబులెన్స్ సిబ్బంది వచ్చి అతడిని ఆస్పత్రికి తరలించారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి


ఎన్‌టీఆర్‌మార్గ్‌లో ట్రాక్టర్‌కు ఎత్తిన చెత్తను కిందకు పడేస్తున్న కార్మికులు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మేయర్ వసీం పేర్కొన్నారు. ఆదివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కమిషనర్ భాగ్యలక్ష్మి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు కార్మిక సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్మిక సంఘాల నాయకులు 129 మంది కోవిడ్, మలేరియా, గ్యార్బేజ్ వర్కర్లకు వేతనాలు పెంచాలని కోరారు. అందుకు మేయర్ వసీం సానుకూలంగా స్పందించి, స్టాండింగ్ కమిటీలో నిర్ణయం తీసుకుంటామన్నారు. రెగ్యులర్ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించమని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు నాగేంద్ర, నాగభూషణం, లక్ష్మీనరసమ్మ, పోతులయ్య, మల్లి, ఓబుళపతి పాల్గొన్నారు.

అడుగడుగునా ఆటంకం:

కార్మికులు నిరవధిక సమ్మె చేస్తుండడంతో నగరంలో చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. ఇలాంటి తరుణంలో కమిషనర్ భాగ్యలక్ష్మి ఆదేశాలతో కార్యదర్శి సంగం శ్రీనివాసులు పర్యవేక్షణలో నగరంలోని పాతూరు, రాణీనగర్, శ్రీకంఠం సర్కిల్, ఎన్‌టీఆర్ మార్గ్, రైల్వే స్టేషన్ రోడ్డు వద్ద చెత్త తరలింపు కార్యక్రమం చేపట్టారు. కొందరు కార్మికులు రెగ్యులర్, ప్రైవేట్ ఉద్యోగుల విధులకు ఆటంకపరిచారు. ఎన్‌టీఆర్ మార్గ్‌లో చెత్తను రోడ్డుపై వేశారు. ఆదివారం రాణీనగర్‌లో కార్మికులు జేసీబీని అడ్డుకున్నారు.

సాక్షి ఫ్యామిలీ
అనంతపురం
సోమవారం ॥ 1-1-2024

కొత్త సంవత్సరం

సాధారణంగా కొత్త సంవత్సరం వస్తోంది అంటే ఎన్నో సంబరాలు. సంవత్సరంతో పాటు తమ జీవితాలలో కూడా మార్పు వస్తుందనే ఆశతో అందరిలోనూ ఉత్సాహం ఉరకలెత్తుతూ ఉంటుంది. ఎవరి పద్ధతులలో వారు వేడుకలు జరుపుకుంటూ ఉంటారు. కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ ఇళ్లని, వీధులని, నగరాలని అలంకరిస్తారు. అలంకారాలు, దీపాలు, టపాకాయలు, కొత్తబట్టలు, మిఠాయిలు (ఎక్కువగా కేకు) పంచుకోవటాలు, విందులు, వినోదాలు, శుభాకాంక్షలు. అంటే రాబోయే కాలం ఆనంద దాయకంగా ఉండాలనే ఆకాంక్ష, ఉంటుందనే విశ్వాసం వ్యక్తం చేయటమే వీటిలోని అసలు అర్థం.

మంచి మాట

కొత్త ఆశలు, ఆశయాలు



మనిషి ఆలోచించటం మొదలుపెట్టినప్పటి నుండి లెక్కించటం కూడా ప్రారంభించాడు. ప్రకృతిలో వస్తున్న మార్పులని పరిశీలించి, తదనుగుణంగా ఉండటం కోసం కాలాన్ని కూడా గణించటం ప్రారంభించాడు. కాలగణనకి ప్రమాణం ప్రకృతిలో జరిగే పరిణామాలే. కొద్దికాలం జరిగిన తరవాత మళ్ళీ ఇంతకు ముందు ఉన్నట్టే ప్రకృతి కనపడితే ఈ క్రమం ఏమిటి? అన్నది అర్థం చేసుకునే ప్రయత్నంలోనే మనిషి కాలాన్ని లెక్కపెట్టటం జరిగింది. లెక్కపెట్టటం ఎక్కడో అక్కడ ఎప్పుడో అప్పుడు మొదలుపెట్టాలి. ఒక్కొక్క ప్రాంతం వారు వారికి అనుకూలంగా ఉన్న సమయం నుండి లెక్కపెట్టటం మొదలుపెట్టారు. కాలక్రమంలో దానిలో ఒక హేతుబద్ధతని అవలంబించారు. ప్రకృతి ఆహ్లాదకరంగా ఉండే సమయాన్ని కాలాన్ని లెక్కకట్టటానికి మొదలుగా తీసుకున్నారు. పాశ్చాత్యులకి ఆహ్లాదకరంగా ఉండే వసంతం (స్ప్రింగ్) మార్చ్, ఏప్రిల్ నెలలు. మార్చ్ 23 ని సంవత్సర మానానికి ఆదిగా పరిగణించే వారు. తరువాత నెల మధ్యలో ఎందుకని ఏప్రిల్ 1 ని సంవత్సరాదిగా జరుపుకునే వారు. కొన్ని రాజకీయ కారణాల వల్ల అది జనవరి 1 కి మారింది. మార్చ్ మొదటి నెల కనుక డిసెంబర్ 10 వ నెల, నవంబర్ 9 వ నెల, అక్టోబర్ 8 వ నెల, సెప్టెంబర్ 7 వ నెల అయ్యాయి. ఆ పేర్లే నెలల సంఖ్యని తెలియ చేస్తున్నాయి. ఈ కాలెండర్ ని గ్రెగేరియన్ కాలెండర్ అంటారు. అందరికీ తమ కాలెండర్ ఉన్నా, ఇప్పుడు ప్రపంచం అంతా ఈ కాలెండర్‌నే అనుసరిస్తోంది.

ఈ కాలెండర్ ప్రకారం జనవరి ఒకటో తారీకుతో కొత్త సంవత్సరం మొదలు అవుతుంది. సౌరమానాన్ని అనుసరించి ఒక సంవత్సరంలో 365 1/3 రోజులు ఉంటాయి. అందుకని నాలుగు సంవత్సరాలకి ఒక మారు లీప్ ఇయర్ అని ఒక రోజు అధికంగా వస్తుంది. ఆ రోజు తక్కువ రోజులు ఉండే ఫిబ్రవరికి వెడుతుంది.

అయితే ఆనందోత్సాహాలు ఎందుకు? ఇంతకాలం జీవితాన్ని ఆనందంగా గడిపినందుకు. ఆ విధంగా గడిపే అవకాశం భగవంతుడు ఇచ్చినందుకు. సంవత్సరంలో మొదటి రోజు ఏ విధంగా గడిపితే సంవత్సరం అంతా అదేవిధంగా ఉంటుందని అందరి విశ్వాసం.

రెండువేల ఇరవై నాలుగవ సంవత్సరం అందరికీ ఆయురారోగ్య ఐశ్వర్యాలని ఆనందాన్ని ఇతోధికంగా ఇవ్వాలని, ప్రపంచంలో శాంతి నెలకొనాలని ఒకరికొకరం ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుందాము.

అనుభవజ్ఞులైన పెద్దలు చేసే సూచన ఏమంటే జరిగిపోయిన సంవత్సరంలో ఏం చేశాము అని సమీక్షించుకుని, గెలుపోటములని, మానావమానాలని, బేరీజు వేసుకుని, తమ లక్ష్యాలని, లక్ష్యసాధన మార్గాలని నిర్ధారించుకుని, పనికి రానివాటిని పక్కకి పెట్టి, అవసరమైన వాటిని చేపట్టటానికి నిర్ణయించుకో వలసిన సమయం ఇది అని. తమ ఆయుర్దాయంలో మరొక సంవత్సరం గడిచిపోయింది, చేయవలసిన పనులు త్వరగా చేయాలి అని తమని తాము హెచ్చరించుకోవాలి. అందుకే ఎంతోమంది ఒక చెడు అలవాటుని మానుతామనో, కొత్తపని ఏదైనా మొదలు పెడతామనో అని నూతన సంవత్సర నిర్ణయాలని ప్రకటిస్తూ ఉంటారు.

– డా. ఎన్. అనంతలక్ష్మి

ముగ్గు ముచ్చట



ముగ్గులకు ఆహ్వానం



26 చుక్కలు
2 వరుసలు
2 వచ్చేవరకు



గుంటి శైలజ
మూసాపేట
హైదరాబాద్

ముగ్గులు పంపవలసిన చిరునామా: ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

మనం అందరం కారణజన్ములం. ఏదో ఒక ప్రత్యేకమైన గొప్ప పని చేసేందుకు ఈ భూమిపై జన్మించాం. ఇంత గొప్ప అవకాశం వృథా చేసుకోకండి. ఈ సంవత్సరం ఏదైనా కొత్త, సృజనాత్మకమైన పని మొదలుపెట్టండి. ఏదైనా కొత్త పని చేయకుండా ఏ సంవత్సరమూ గడచిపోకూడదు. మీకు ఏ కలలూ లేకపోతే, వాటిని నిజం చేసుకోలేరు కదా! ఏ కొత్త ఆవిష్కరణ అయినా ఒక కలతో మొదలవుతుంది. ఉన్నతంగా కలలుగనే, ఆలోచించే స్వేచ్ఛని మీకు మీరు ఇచ్చుకోండి. ఆపై, వాటిని సాధించేందుకు నూరుశాతం ధైర్యంతో, సమర్పణభావంతో పనిచేయండి.

ఒక అసాధ్యాన్ని సాధిస్తా!

ఈ భూమిని మరింత గొప్పగా తీర్చిదిద్దుతా



గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్

మనస్సు పూర్తిగా వర్తమానంలో ఉన్నప్పుడు, మీకు సరైన ఆలోచనలు వస్తాయి. లక్ష్యాలు పెట్టుకోవడం మాత్రమే కాకుండా, వాటిని సాధించే విధానం కూడా ప్రణాళిక వేసుకోవాలి. మూడేళ్ళ తర్వాత మిమ్మల్ని మీరు ఎలా చూడాలనుకుంటున్నారు? ఒక ఇరవై ఏళ్ల తర్వాత? నలభై ఏళ్ళ తర్వాత? ఫలితం గురించి ఎక్కువ ఆలోచించకుండా మీ విధిని నూరు శాతం నిర్వర్తించండి.

చాలాసార్లు ఉన్నతమైన కలలు కనేవారిని ఇతరులు అపహాస్యం చేశారు. కానీ వారు వెనక్కు తగ్గకుండా, తమ లక్ష్యాలను సాధించేవరకూ స్థిరంగా నిలబడ్డారు.

మనలో ఉండే ప్రాణశక్తి ప్రవహించేందుకు ఒక దిశను చూపటం అవసరం. దానికి సరైన దిశను చూపకపోతే మీరు గందరగోళంలో చిక్కుకుపోతారు. జీవశక్తి ఒక నిర్దిష్ట దిశలో పయనించేలా చేయాలంటే మనకు నిబద్ధత అవసరం. ఈ రోజున చాలామంది, తమ జీవితానికి ఒక నిర్దిష్టమైన లక్ష్యం, దిశానిర్దేశం లేకపోవడం చేత అయోమయంలో ఉన్నారు. మీరు ఆనందంగా ఉన్నప్పుడు మీ ప్రాణశక్తి తారాస్థాయిలో ఉంటుంది, మరి అంత ఎక్కువగా ఉన్న ఆ ప్రాణశక్తికి, ఎటువెళ్లాలో చెప్పకపోతే, అది అక్కడే చిక్కుకుపోతుంది. ఒకేచోట పేరుకుపోతే ఏమౌతుంది? కుళ్ళిపోయి, పనికి రాకుండా పోతుంది.

ఇక్కడ రహస్యం ఏమిటీ అంటే, మన లక్ష్యం పట్ల నిబద్ధత ఎంత గొప్పగా ఉంటే, దాన్ని సాధించేందుకు అంత గొప్ప శక్తి మనకు లభిస్తుంది. లక్ష్యం ఎంత గొప్పగా ఉంటే, పనులు అంతా సులభంగా, తేలికగా జరిగిపోతాయి. అదే చిన్న లక్ష్యాలు పెట్టుకున్నారనుకోండి, ఎందుకంటే మీలో సామర్థ్యం కొండంత ఉంది, మీరేమో ఈ చిన్న పనిలో ఇరుక్కుపోయారు అనిపించి మీకే చికాకుగా ఉంటుంది.

మీరు సమాజం బాగు కోసం పనిచేస్తున్నప్పుడు, మీరు పది పనులు చేస్తున్నారనుకుందాం. వాటిలో ఒక పనిలో పొరపాటు జరిగినా, మిగతా తొమ్మిది పనులూ చేస్తూ ఉంటే, ఈ మొదటి పనిలో పొరపాట్లు వాటంతట అవే సర్దుకుంటాయి. సాధారణంగా కృప అనేది ఇలా పనిచేస్తుంది. మొదట అవసరమైన వనరులు సమకూరితే, అప్పుడు పెద్ద లక్ష్యం పెట్టుకుని పని చేద్దామమని మనం సాధారణంగా అనుకుంటాం. కాని, మొదట మీ లక్ష్యం గొప్పగా ఉంటే, వనరులు వాటంతట అవే సమకూరుతాయి. మనం పెట్టుకున్న లక్ష్యమే మనకు ఆ శక్తిని బహుమతిగా ఇస్తుంది. మీరు మీ కుటుంబ శ్రేయస్సును లక్ష్యంగా పెట్టుకున్నారనుకోండి, ఆ కుటుంబమే మీకు సహాయం చేస్తుంది. మీరు సమాజం మొత్తానికి గొప్ప పనిచేయాలని సంకల్పించుకుంటే సమాజం మొత్తం మీకు సహాయపడటాన్ని మీరే చూస్తారు. మీకు కావలసిన సహాయం మీరు అడక్కముందే వచ్చి చేరుతుంది.

మీ నిబద్ధతకు ఆశించిన ఫలితం రావాలంటే సరైన ఆలోచనలు, సరైన చర్యలు రెండూ అవసరమే. మీరు సాధించాలనుకుంటున్న అన్ని విషయాలతో పెద్ద చిట్టా తయారు చేసుకోకండి. స్థూలంగా పరిశీలించి, నిజంగా అవసరమైన కొన్ని లక్ష్యాలను ఎంచుకోండి. మనకు అత్యంత సంతృప్తిని ఇచ్చే వాటిని, దీర్ఘకాలంలో పదిమంది జీవితాలను తీర్చిదిద్దే వాటిని ఎంచుకుని పని చేసినపుడు, మగిలిన చిన్నాచితక విషయాలు వాటంతట అవే గాడిలో పడతాయి.

సాధారణంగా మనం మనసులో తపన పడుతూ ఉంటాము, కానీ మన చర్యలు నెమ్మదిగా ఉంటాయి. విజయానికి సోపానం ఏమంటే, మనసులో ఓరిమి, పనిలో ఉత్సాహం. అభిరుచిని, వైరాగ్యాన్ని సరిసమానంగా స్వీకరించండి. మీ లక్ష్యసాధనకై ధైర్యంగా ముందుకు సాగండి, అవసరమైనప్పుడు వదిలేయడం కూడా నేర్చుకోవాలి. అపుడు సహజంగా సమృద్ధి చేకూరుతుంది.

మీరు ధ్యానం చేసినపుడు మీరు సూక్ష్మంగా గమనించగలుగుతారు. మీకు పూర్తిగా విశ్రాంతి లభిస్తుంది, అదే సమయంలో బుద్ధి, వివేచన, సద్యస్ఫూర్తి వృద్ధి చెందుతాయి. మీరు ఏకాగ్రతతో ఉండి పనిచేస్తే అది సరైన పని అవుతుంది. చెదిరిపోని దృష్టి, సద్యస్ఫూర్తితో పనిచేసే మనసు మీ లక్ష్యాన్ని సాధించేందుకు సహాయ పడతాయి. ఒత్తిడి లేని, ఉత్సాహభరితమైన జీవితానికి, మీరు అనుకున్న లక్ష్యాలపై స్పష్టమైన అవగాహనతో పనిచేసేందుకు సరైన మార్గం ధ్యానం.

నిబద్ధత అనేది దీర్ఘకాలంలో ఎప్పుడూ సుఖాన్ని ఇస్తుంది. ఈ ప్రపంచాన్ని మరింత సురక్షితంగా జీవించే అద్భుత ప్రదేశంగా మార్చాలని కంకణం కట్టుకోండి. అసాధ్యమైన కల కనండి!

సినిమా



రజనీకాంత్

కన్యాకుమారిలో వేటగాడు

కన్యాకుమారిలో తిరుగుతున్నాడు వెట్టయాన్ (తెలుగులో 'వేటగాడు' అని అర్థం). రజనీకాంత్ హీరోగా టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'వెట్టయాన్'. అమితాబ్ బచ్చన్, ఫాహద్ ఫాజిల్, రానా, మంజు వారియర్, రితికాసింగ్, దుషారా విజయన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా తాజా చిత్రీకరణ కన్యాకుమారి పరిసరాల్లోని లొకేషన్స్‌లో జరుగుతోందని కోలీవుడ్ సమాచారం. రజనీకాంత్, ఫాహద్ ఫాజిల్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్రంలో ఓ పోలీసాఫీసర్ పాత్రలో రజనీ నటిస్తున్నారని, నకిలీ ఎన్‌కౌంటర్స్ నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని సమాచారం. సుభాస్కరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది వేసవిలో విడుదల కానుంది.

గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్



విజయ్

విజయ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమాకు 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్' అనే టైటిల్ ఖరారైంది. విజయ్ కెరీర్‌లో 68వ సినిమాగా వస్తున్న ఈ చిత్రానికి వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్నారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. న్యూ ఇయర్ (2024) సందర్భంగా ఈసినిమా టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఆదివారం విడుదల చేశారు మేకర్స్. అలాగే ఈ సినిమాకు సంబంధించిన మరో లుక్ నేడు రానుందని కోలీవుడ్ సమాచారం. ఫస్ట్‌లుక్‌ని చూస్తే ఈ చిత్రంలో విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారని స్పష్టమవుతోంది. మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ప్రశాంత్, లైలా, స్నేహ, జయరాం, యోగిబాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఈ ఏడాది దీపావళి కానుకగా విడుదలకానుందనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నారు.



నరేశ్, నాగార్జున, రాజ్‌తరుణ్

మా జోలికొస్తే నా సామిరంగ!

''మా జోలికొస్తే.. మాకడ్డు వస్తే.. మామూలుగా ఉండదు.. నా సామిరంగ..' అంటూ పాడేస్తున్నారు నాగార్జున. ఆయన హీరోగా నటించిన చిత్రం 'నా సామిరంగ'. విజయ్ బిన్నీ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఆషికా రంగనాథ్ కథానాయికగా, 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్ కీలక పాత్రల్లో నటించారు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈ నెల 14న విడుదలకానుంది. ఎంఎం కీరవాణి సంగీతం అందించారు. ఈ చిత్రం నుంచి 'నా సామిరంగ..' అంటూ సాగే టైటిల్ సాంగ్ లిరికల్ వీడియోను ఆదివారం విడుదల చేశారు మేకర్స్. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటను కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్ పాడారు. 'మా జోలికొస్తే మాకడ్డు వస్తే మామూలుగా ఉండదు నా సామిరంగ.., ఈ గీత తొక్కితే మా సేత సిక్కితే మామూలుగా ఉండదు నా సామిరంగ..' అంటూ ఫుల్ జోష్‌లో సాగే ఈ పాటలో నాగార్జునతో కలిసి 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్ కూడా చిందేశారు. ''మాస్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'నా సామిరంగ' రూపొందింది. ప్రధాన తారాగణంతో పాటు 300 మంది డ్యాన్సర్స్‌తో లావిష్‌గా చిత్రీకరించిన 'నా సామిరంగ..' పాటకు దినేష్ మాస్టర్ అందించిన నృత్యాలు అద్భుతంగా ఉంటాయి'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: శివేంద్ర దాశరథి.

అది మరచిపోలేని జ్ఞాపకం

– శివాత్మిక రాజశేఖర్



''నేను ఎప్పట్నుంచో స్కై డైవింగ్ చేయాలనుకుంటున్నాను. అది 2023లో నెరవేరింది. దుబాయ్‌లో అక్క(శివాని), నేను రెండు వేల అడుగుల ఎత్తు నుంచి స్కై డైవింగ్ చేశాం. 2023 అనే కాదు.. నా జీవితంలోనే నేను మరచిపోలేని జ్ఞాపకంగా ఈ స్కై డైవింగ్ అడ్వెంచర్‌ను గుర్తు పెట్టుకుంటాను'' అని హీరోయిన్ శివాత్మిక అన్నారు. **2023కి వీడ్కోలు పలుకుతూ 2024కి స్వాగతం పలుకుతున్న శివాత్మిక రాజశేఖర్ పంచుకున్న విశేషాలు...**

■ మీ జీవితంలో 2023 ఎలా గడిచింది?

చెప్పాలంటే... 2023 నాకు గొప్పగా గడిచింది. చాలా విధాలుగా కలిసొచ్చింది. నా కెరీర్ స్టార్టింగ్‌లోనే మంచి ప్రాజెక్ట్స్‌లో భాగమయ్యాననే భావన కలిగింది. ఎప్పట్నుంచో నేను చేయాలనుకుంటున్న పనులు ఈ ఏడాది జరిగాయి. ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నాను. నన్ను నేను మెరుగుపరచుకోవడం కోసం కొత్త నైపుణ్యాలను నేర్చుకుంటున్నాను. కుటుంబం పరంగా కూడా బాగా గడిచింది. దేవుడి దయవల్ల, అదృష్టంగా 2023 నా జీవితంలో సంతోషంగా ముగిసింది.

■ ఈ ఏడాది మీ జీవితంలో జరిగిన చెడు ఘటనలు ఏవైనా ఉన్నాయా?

మంచి జరిగినట్లే... ప్రతి ఏడాది చెడు కూడా ఉంటుంది. అయితే కొత్త సంవత్సరాన్ని మొదలు పెట్టబోయే ఈ తరుణంలో వాటిని నేను గుర్తుతెచ్చుకోవాలనుకోవడం లేదు.

■ కొత్త ఏడాది కోసం మీరు తీసుకున్న కొత్త నిర్ణయాలు ఏంటి?


నా మనసును ఎక్కువగా ఫాలో అవుతూ వర్క్స్ చేస్తాను. ప్రతి అంశం గురించి ఎక్కువగా ఆలోచించకుండా ప్రస్తుత క్షణాన్ని ఆస్వాదించేలా జీవిస్తాను. ఇలా గత ఏడాదిలో ప్రయత్నించి సంతోషంగా జీవనం సాగించాను. ఈ ఏడాది కూడా ఇదే ఫాలో అవ్వాలనుకుంటున్నాను.

■ 2024 మీ జీవితంలో ఎలా ఉండాలనుకుంటున్నారు?

పెద్దగా అంచనాలు ఏమీ పెట్టుకోవడం లేదు. ఫ్లోను బట్టి ముందుకెళ్తాను. అయితే అన్నీ మంచి, గొప్ప అంశాలే జరగాలని కోరుకుంటున్నాను. సంతోషంగా, హాయిగా, ఆరోగ్యకరంగా గడవాలని ఆశిస్తున్నాను.

■ కొత్త ఏడాదిని ఎలా సెలబ్రేట్ చేసుకోబోతున్నారు?

కొత్త ఏడాది ఎప్పటిలానే అమ్మానాన్న(జీవిత, రాజశేఖర్), అక్క శివానీలతో హైదరాబాద్‌లోనే సెలబ్రేట్ చేసుకుంటున్నాను. నా స్నేహితులు, ఫ్యామిలీ ఫ్రెండ్స్‌ను కలుస్తాను.



బెల్లంకొండ సాయిశ్రీనివాస్

యాక్షన్ ఎంటర్‌టైనర్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'బీఎస్ఎస్ 10'(వర్కింగ్ టైటిల్). 'భీమ్లా నాయక్' మూవీ తర్వాత సాగర్ కె.చంద్ర దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ సినిమా కీలక షెడ్యూల్ పూర్తయింది. ''యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'బీఎస్ఎస్ 10'. భారీ బడ్జెట్‌తో అత్యున్నత సాంకేతిక విలువలతో ఈ సినిమా తెరకెక్కుతోంది. బెల్లంకొండ శ్రీనివాస్‌ని గతంలో ఎన్నడూ చూడని పవర్ ఫుల్ పాత్రలో సరికొత్తగా చూపించనున్నారు సాగర్ కె.చంద్ర. ఈ సినిమాలోని కీలకమైన షూటింగ్ షెడ్యూల్‌ను పూర్తి చేశాం. ఈ చిత్రంలో కొంతమంది ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ నెల 3న శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరీష్ కట్టా, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమెరా: ముఖేష్ జ్ఞానేష్.



మృణాల్ ఠాకూర్



లారెన్స్

లారెన్స్‌కు జోడీగా..?

హీరో రాఘవా లారెన్స్, హీరోయిన్ మృణాళ్ ఠాకూర్ జోడీ కట్టనున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. రాఘవా లారెన్స్ హీరోగా రమేష్ వర్మ దర్శకత్వంలో ఓ భారీ బడ్జెట్ ఫిల్మ్ తెరకెక్కనుందనే వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుందని టాక్. ఈ చిత్రంలో లారెన్స్‌కు జోడీగా మృణాళ్ కనిపిస్తారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో లేటెస్ట్‌గా వినిపిస్తోంది. అలాగే ఈ సినిమాకు 'శ్రీరామరక్ష' అనే టైటిల్‌ను కూడా అనుకుంటున్నారట మేకర్స్. కాగా ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

వాస్తవ ఘటనలతో సర్కారు నౌకరి

ప్రముఖ సింగర్ సునీత కుమారుడు ఆకాష్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'సర్కారు నౌకరి'. గంగనమోని శేఖర్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో భావన హీరోయిన్‌గా నటించారు. ఆర్కే టెలీ షో బ్యానర్‌పై డైరెక్టర్ కె.రాఘవేంద్రరావు నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రెస్‌మీట్‌లో గంగనమోని శేఖర్ మాట్లాడుతూ– ''వాస్తవ ఘటనల స్ఫూర్తితో 90వ దశకం నేపథ్యంలో 'సర్కారు నౌకరి' రూపొందింది. ఇందులోని సందేశం, వినోదం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అన్నారు. ''సర్కారు నౌకరి'లో ప్రభుత్వ ఉద్యోగి పాత్రలో కనిపిస్తాను'' అన్నారు ఆకాష్. ''ఈ మూవీతో తెలుగులో పరిచయం కావడం సంతోషంగా ఉంది'' అన్నారు భావన.



ఆకాష్, భావన

దూడుం దుక్కుడుం బాగుంది

– జీవీ ప్రకాశ్ కుమార్



శ్రీనాథ్, జీవీ ప్రకాశ్ కుమార్, ప్రణవ్, షాజ్ఞ, భువన్ రెడ్డి

''ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు–500143' చిత్రంలోని 'దూడుం దుక్కుడుం..' పాట బాగుంది. ఈ సాంగ్‌కి క్లాసికల్ టచ్ ఇవ్వడం బాగా నచ్చింది. ఈ సినిమాలోని ఇతర పాటలు ఎలా ఉంటాయో అని ఆసక్తి పెరిగింది. ఈ చిత్రం తప్పకుండా మ్యూజికల్ హిట్ అవుతుంది'' అని సంగీత దర్శకుడు, నటుడు జీవీ ప్రకాశ్ కుమార్ అన్నారు. ప్రణవ్ సింగంపల్లి, షాజ్ఞ శ్రీ వేణున్ జంటగా శ్రీనాథ్ పులకురం దర్శకత్వం వహించిన చిత్రం 'ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు– 500143'. కొవ్వూరి అరుణ సమర్పణలో బ్లాక్ యాంట్ పిక్చర్స్‌పై భువన్ రెడ్డి కొవ్వూరి నిర్మించిన ఈ సినిమా రిలీజ్‌కి సిద్ధంగా ఉంది. కార్తీక్ రోడ్రిగ్జ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'దూడుం దుక్కుడుం..' పాటని జీవీ ప్రకాశ్ కుమార్ విడుదల చేశారు. శ్రీ సాయి కిరణ్ సాహిత్యం అందించిన ఈ పాటను మంగ్లీ పాడారు. ఈ చిత్రానికి కెమెరా: నిఖిల్ సురేంద్రన్, నేపథ్య సంగీతం: కమ్రాన్.

సాక్షి ఫ్యామిలీ
అనంతపురం
సోమవారం ॥ 1-1-2024

సాధారణంగా కొత్త సంవత్సరం వస్తోంది అంటే ఎన్నో సంబరాలు. సంవత్సరంతో పాటు తమ జీవితాలలో కూడా మార్పు వస్తుందనే ఆశతో అందరిలోనూ ఉత్సాహం ఉరకలెత్తుతూ ఉంటుంది. ఎవరి పద్ధతులలో వారు వేడుకలు జరుపుకుంటూ ఉంటారు. కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ ఇళ్ళని, వీధులని, నగరాలని అలంకరిస్తారు. అలంకారాలు, దీపాలు, టపాకాయలు, కొత్తబట్టలు, మిఠాయిలు (ఎక్కువగా కేకు) పంచుకోవటాలు, విందులు, వినోదాలు, శుభాకాంక్షలు. అంటే రాబోయే కాలం ఆనంద దాయకంగా ఉండాలనే ఆకాంక్ష, ఉంటుందనే విశ్వాసం వ్యక్తం చేయటమే వీటిలోని అసలు అర్థం.

కొత్త సంవత్సరం

మంచి మాట

కొత్త ఆశలు, ఆశయాలు



మనిషి ఆలోచించటం మొదలుపెట్టినప్పటి నుండి లెక్కించటం కూడా ప్రారంభించాడు. ప్రకృతిలో వస్తున్న మార్పులని పరిశీలించి, తదనుగుణంగా ఉండటం కోసం కాలాన్ని కూడా గణించటం ప్రారంభించాడు. కాలగణనకి ప్రమాణం ప్రకృతిలో జరిగే పరిణామాలే. కొద్దికాలం జరిగిన తరవాత మళ్ళీ ఇంతకు ముందు ఉన్నట్టే ప్రకృతి కనపడితే ఈ క్రమం ఏమిటి? అన్నది అర్థం చేసుకునే ప్రయత్నంలోనే మనిషి కాలాన్ని లెక్కపెట్టటం జరిగింది. లెక్కపెట్టటం ఎక్కడో అక్కడ ఎప్పుడో అప్పుడు మొదలుపెట్టాలి. ఒక్కొక్క ప్రాంతం వారు వారికి అనుకూలంగా ఉన్న సమయం నుండి లెక్కపెట్టటం మొదలుపెట్టారు. కాలక్రమంలో దానిలో ఒక హేతుబద్ధతని అవలంబించారు. ప్రకృతి ఆహ్లాదకరంగా ఉండే సమయాన్ని కాలాన్ని లెక్కకట్టటానికి మొదలుగా తీసుకున్నారు. పాశ్చాత్యులకి ఆహ్లాదకరంగా ఉండే వసంతం (స్ప్రింగ్) మార్చ్, ఏప్రిల్ నెలలు. మార్చ్ 23 ని సంవత్సర మానానికి ఆదిగా పరిగణించే వారు. తరువాత నెల మధ్యలో ఎందుకని ఏప్రిల్ 1 ని సంవత్సరాదిగా జరుపుకునే వారు. కొన్ని రాజకీయ కారణాల వల్ల అది జనవరి 1 కి మారింది. మార్చ్ మొదటి నెల కనుక డిసెంబర్ 10 వ నెల, నవంబర్ 9 వ నెల, అక్టోబర్ 8 వ నెల, సెప్టెంబర్ 7 వ నెల అయ్యాయి. ఆ పేర్లే నెలల సంఖ్యని తెలియ చేస్తున్నాయి. ఈ కాలెండర్ ని గ్రెగేరియన్ కాలెండర్ అంటారు. అందరికీ తమ కాలెండర్ ఉన్నా, ఇప్పుడు ప్రపంచం అంతా ఈ కాలెండర్‌నే అనుసరిస్తోంది.

ఈ కాలెండర్ ప్రకారం జనవరి ఒకటో తారీకుతో కొత్త సంవత్సరం మొదలు అవుతుంది. సౌరమానాన్ని అనుసరించి ఒక సంవత్సరంలో 365 1/3 రోజులు ఉంటాయి. అందుకని నాలుగు సంవత్సరాలకి ఒక మారు లీప్ ఇయర్ అని ఒక రోజు అధికంగా వస్తుంది. ఆ రోజు తక్కువ రోజులు ఉండే ఫిబ్రవరికి వెడుతుంది.

అయితే ఆనందోత్సాహాలు ఎందుకు? ఇంతకాలం జీవితాన్ని ఆనందంగా గడిపినందుకు. ఆ విధంగా గడిపే అవకాశం భగవంతుడు ఇచ్చినందుకు. సంవత్సరంలో మొదటి రోజు ఏ విధంగా గడిపితే సంవత్సరం అంతా అదేవిధంగా ఉంటుందని అందరి విశ్వాసం.

రెండువేల ఇరవై నాలుగవ సంవత్సరం అందరికీ ఆయురారోగ్య ఐశ్వర్యాలని అనందాన్ని ఇతోధికంగా ఇవ్వాలని, ప్రపంచంలో శాంతి నెలకొనాలని ఒకరికొకరం ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుందాము.

అనుభవజ్ఞులైన పెద్దలు చేసే సూచన ఏమంటే జరిగిపోయిన సంవత్సరంలో ఏం చేశాము అని సమీక్షించుకుని, గెలుపోటములని, మానావమానాలని, బేరీజు వేసుకుని, తమ లక్ష్యాలని, లక్ష్యసాధన మార్గాలని నిర్ధారించుకుని, పనికి రానివాటిని పక్కకి పెట్టి, అవసరమైన వాటిని చేపట్టటానికి నిర్ణయించుకో వలసిన సమయం ఇది అని. తమ ఆయుర్దాయంలో మరొక సంవత్సరం గడిచిపోయింది, చేయవలసిన పనులు త్వరగా చేయాలి అని తమని తాము హెచ్చరించుకోవాలి. అందుకే ఎంతోమంది ఒక చెడు అలవాటుని మానుతామనో, కొత్తపని ఏదైనా మొదలు పెడతామనో అని నూతన సంవత్సర నిర్ణయాలని ప్రకటిస్తూ ఉంటారు.

– డా. ఎన్. అనంతలక్ష్మి

మనం అందరం కారణజన్ములం. ఏదో ఒక ప్రత్యేకమైన గొప్ప పని చేసేందుకు ఈ భూమిపై జన్మించాం. ఇంత గొప్ప అవకాశం వృథా చేసుకోకండి. ఈ సంవత్సరం ఏదైనా కొత్త, సృజనాత్మకమైన పని మొదలుపెట్టండి. ఏదైనా కొత్త పని చేయకుండా ఏ సంవత్సరమూ గడచిపోకూడదు. మీకు ఏ కలలూ లేకపోతే, వాటిని నిజం చేసుకోలేరు కదా! ఏ కొత్త ఆవిష్కరణ అయినా ఒక కలతో మొదలవుతుంది. ఉన్నతంగా కలలుగనే, ఆలోచించే స్వేచ్ఛని మీకు మీరు ఇచ్చుకోండి. ఆపై, వాటిని సాధించేందుకు నూరుశాతం ధైర్యంతో, సమర్పణభావంతో పనిచేయండి.

ఒక అసాధ్యాన్ని సాధిస్తా!

ఈ భూమిని మరింత గొప్పగా తీర్చిదిద్దుతా

చాలాసార్లు ఉన్నతమైన కలలు కనేవారిని ఇతరులు అపహాస్యం చేశారు. కానీ వారు వెనక్కు తగ్గకుండా, తమ లక్ష్యాలను సాధించేవరకూ స్థిరంగా నిలబడ్డారు.

మనలో ఉండే ప్రాణశక్తి ప్రవహించేందుకు ఒక దిశను చూపటం అవసరం. దానికి సరైన దిశను చూపకపోతే మీరు గందరగోళంలో చిక్కుకుపోతారు. జీవశక్తి ఒక నిర్దిష్ట దిశలో పయనించేలా చేయాలంటే మనకు నిబద్ధత అవసరం. ఈ రోజున చాలామంది, తమ జీవితానికి ఒక నిర్దిష్టమైన లక్ష్యం, దిశానిర్దేశం లేకపోవడం చేత అయోమయంలో ఉన్నారు. మీరు ఆనందంగా ఉన్నప్పుడు మీ ప్రాణశక్తి తారాస్థాయిలో ఉంటుంది, మరి అంత ఎక్కువగా ఉన్న ఆ ప్రాణశక్తికి, ఎటువెళ్లాలో చెప్పకపోతే, అది అక్కడే చిక్కుకుపోతుంది. ఒకేచోట పేరుకుపోతే ఏమౌతుంది? కుళ్ళిపోయి, పనికి రాకుండా పోతుంది.

ఇక్కడ రహస్యం ఏమిటీ అంటే, మన లక్ష్యం పట్ల నిబద్ధత ఎంత గొప్పగా ఉంటే, దాన్ని సాధించేందుకు అంత గొప్ప శక్తి మనకు లభిస్తుంది. లక్ష్యం ఎంత గొప్పగా ఉంటే, పనులు అంతా సులభంగా, తేలికగా జరిగిపోతాయి. అదే చిన్న లక్ష్యాలు పెట్టుకున్నారనుకోండి, ఎందుకంటే మీలో సామర్థ్యం కొండంత ఉంది, మీరేమో ఈ చిన్న పనిలో ఇరుక్కుపోయారు అనిపించి మీకే చికాకుగా ఉంటుంది.

మీరు సమాజం బాగు కోసం పనిచేస్తున్నప్పుడు, మీరు పది పనులు చేస్తున్నారనుకుందాం. వాటిలో ఒక పనిలో పొరపాటు జరిగినా, మిగతా తొమ్మిది పనులూ చేస్తూ ఉంటే, ఈ మొదటి పనిలో పొరపాట్లు వాటంతట అవే సర్దుకుంటాయి. సాధారణంగా కృప అనేది ఇలా పనిచేస్తుంది. మొదట అవసరమైన వనరులు సమకూరితే, అప్పుడు పెద్ద లక్ష్యం పెట్టుకుని పని చేద్దామమని మనం సాధారణంగా అనుకుంటాం. కాని, మొదట మీ లక్ష్యం గొప్పగా ఉంటే, వనరులు వాటంతట అవే సమకూరుతాయి. మనం పెట్టుకున్న లక్ష్యమే మనకు ఆ శక్తిని బహుమతిగా ఇస్తుంది. మీరు మీ కుటుంబ శ్రేయస్సును లక్ష్యంగా పెట్టుకున్నారనుకోండి, ఆ కుటుంబమే మీకు సహాయం చేస్తుంది. మీరు సమాజం మొత్తానికి గొప్ప పనిచేయాలని సంకల్పించుకుంటే సమాజం మొత్తం మీకు సహాయపడటాన్ని మీరే చూస్తారు. మీకు కావలసిన సహాయం మీరు అడక్కముందే వచ్చి చేరుతుంది.



గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్

మనస్సు పూర్తిగా వర్తమానంలో ఉన్నప్పుడు, మీకు సరైన ఆలోచనలు వస్తాయి. లక్ష్యాలు పెట్టుకోవడం మాత్రమే కాకుండా, వాటిని సాధించే విధానం కూడా ప్రణాళిక వేసుకోవాలి. మూడేళ్ళ తర్వాత మిమ్మల్ని మీరు ఎలా చూడాలనుకుంటున్నారు? ఒక ఇరవై ఏళ్ల తర్వాత? నలభై ఏళ్ళ తర్వాత? ఫలితం గురించి ఎక్కువ ఆలోచించకుండా మీ విధిని నూరు శాతం నిర్వర్తించండి.


మీ నిబద్ధతకు ఆశించిన ఫలితం రావాలంటే సరైన ఆలోచనలు, సరైన చర్యలు రెండూ అవసరమే. మీరు సాధించాలనుకుంటున్న అన్ని విషయాలతో పెద్ద చిట్టా తయారు చేసుకోకండి. స్థూలంగా పరిశీలించి, నిజంగా అవసరమైన కొన్ని లక్ష్యాలను ఎంచుకోండి. మనకు అత్యంత సంతృప్తిని ఇచ్చే వాటిని, దీర్ఘకాలంలో పదిమంది జీవితాలను తీర్చిదిద్దే వాటిని ఎంచుకుని పని చేసినపుడు, మిగిలిన చిన్నాచితక విషయాలు వాటంతట అవే గాడిలో పడతాయి.

సాధారణంగా మనం మనసులో తపన పడుతూ ఉంటాము, కానీ మన చర్యలు నెమ్మదిగా ఉంటాయి. విజయానికి సోపానం ఏమంటే, మనసులో ఓరిమి, పనిలో ఉత్సాహం. అభిరుచిని, వైరాగ్యాన్ని సరిసమానంగా స్వీకరించండి. మీ లక్ష్య సాధనకై ధైర్యంగా ముందుకు సాగండి, అవసరమైనప్పుడు వదిలేయడం కూడా నేర్చుకోవాలి. అపుడు సహజంగా సమృద్ధి చేకూరుతుంది.

మీరు ధ్యానం చేసినపుడు మీరు సూక్ష్మంగా గమనించగలుగుతారు. మీకు పూర్తిగా విశ్రాంతి లభిస్తుంది, అదే సమయంలో బుద్ధి, వివేచన, సద్యఃస్ఫూర్తి వృద్ధి చెందుతాయి. మీరు ఎఱుకతో ఉండి పనిచేస్తే అది సరైన పని అవుతుంది. చెదిరిపోని దృష్టి, సద్యఃస్ఫూర్తితో పనిచేసే మనసు మీ లక్ష్యాన్ని సాధించేందుకు సహాయ పడతాయి. ఒత్తిడి లేని, ఉత్సాహభరితమైన జీవితానికి, మీరు అనుకున్న లక్ష్యాలపై స్పష్టమైన అవగాహనతో పనిచేసేందుకు సరైన మార్గం ధ్యానం.

నిబద్ధత అనేది దీర్ఘకాలంలో ఎప్పుడూ సుఖాన్ని ఇస్తుంది. ఈ ప్రపంచాన్ని మరింత సురక్షితంగా జీవించే అద్భుత ప్రదేశంగా మార్చాలని కంకణం కట్టుకోండి. అసాధ్యమైన కల కనండి!

ముగ్గు ముచ్చట



ముగ్గులకు ఆహ్వానం



26 చుక్కలు
2 వరుసలు
2 వచ్చేవరకు



గుంటి శైలజ
మూసాపేట
హైదరాబాద్

ముగ్గులు పంపవలసిన చిరునామా: ముగ్గు–ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్–34. ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

సినిమా



● రజనీకాంత్

కన్యాకుమారిలో వేటగాడు

కన్యాకుమారిలో తిరుగుతున్నాడు వెట్టయాన్ (తెలుగులో 'వేటగాడు' అని అర్థం). రజనీకాంత్ హీరోగా టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'వెట్టయాన్'. అమితాబ్ బచ్చన్, ఫాహద్ ఫాజిల్, రానా, మంజు వారియర్, రితికాసింగ్, దుషారా విజయన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా తాజా చిత్రీకరణ కన్యాకుమారి పరిసరాల్లోని లొకేషన్స్‌లో జరుగుతోందని కోలీవుడ్ సమాచారం. రజనీకాంత్, ఫాహద్ ఫాజిల్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్రంలో ఓ పోలీసాఫీసర్ పాత్రలో రజనీ నటిస్తున్నారని, నకిలీ ఎన్‌కౌంటర్స్ నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని సమాచారం. సుభాస్కరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది వేసవిలో విడుదల కానుంది.



● విజయ్

గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్

విజయ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమాకు 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్' అనే టైటిల్ ఖరారైంది. విజయ్ కెరీర్‌లో 68వ సినిమాగా వస్తున్న ఈ చిత్రానికి వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్నారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. న్యూ ఇయర్ (2024) సందర్భంగా ఈసినిమా టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఆదివారం విడుదల చేశారు మేకర్స్. అలాగే ఈ సినిమాకు సంబంధించిన మరో లుక్ నేడు రానుందని కోలీవుడ్ సమాచారం. ఫస్ట్‌లుక్‌ని చూస్తే ఈ చిత్రంలో విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారని స్పష్టమవుతోంది. మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ప్రశాంత్, లైలా, స్నేహ, జయరాం, యోగిబాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఈ ఏడాది దీపావళి కానుకగా విడుదలకానుందనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నారు.



● నరేశ్, నాగార్జున, రాజ్‌తరుణ్

మా జోలికొస్తే నా సామిరంగ!

''మా జోలికొస్తే.. మాకడ్డు వస్తే.. మామూలుగా ఉండదు.. నా సామిరంగ..' అంటూ పాడేస్తున్నారు నాగార్జున. ఆయన హీరోగా నటించిన చిత్రం 'నా సామిరంగ'. విజయ్ బిన్నీ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఆషికా రంగనాథ్ కథానాయికగా, 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్ కీలక పాత్రల్లో నటించారు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈ నెల 14న విడుదలకానుంది. ఎంఎం కీరవాణి సంగీతం అందించారు. ఈ చిత్రం నుంచి 'నా సామిరంగ..' అంటూ సాగే టైటిల్ సాంగ్ లిరికల్ వీడియోను ఆదివారం విడుదల చేశారు మేకర్స్. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటను కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్ పాడారు. 'మా జోలికొస్తే మాకడ్డు వస్తే మామూలుగా ఉండదు నా సామిరంగ.., ఈ గీత తొక్కితే మా సేత సిక్కితే మామూలుగా ఉండదు నా సామిరంగ..' అంటూ ఫుల్ జోష్‌లో సాగే ఈ పాటలో నాగార్జునతో కలిసి 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్ కూడా చిందేశారు. ''మాస్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'నా సామిరంగ' రూపొందింది. ప్రధాన తారాగణంతో పాటు 300 మంది డ్యాన్సర్స్‌తో లావిష్‌గా చిత్రీకరించిన 'నా సామిరంగ..' పాటకు దినేష్ మాస్టర్ అందించిన నృత్యాలు అద్భుతంగా ఉంటాయి'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: శివేంద్ర దాశరథి.



అది మరచిపోలేని జ్ఞాపకం

– శివాత్మిక రాజశేఖర్

''నేను ఎప్పట్నుంచో స్కై డైవింగ్ చేయాలనుకుంటున్నాను. అది 2023లో నెరవేరింది. దుబాయ్‌లో అక్క(శివాని), నేను రెండు వేల అడుగుల ఎత్తు నుంచి స్కై డైవింగ్ చేశాం. 2023 అనే కాదు.. నా జీవితంలోనే నేను మరచిపోలేని జ్ఞాపకంగా ఈ స్కై డైవింగ్ అడ్వెంచర్‌ను గుర్తు పెట్టుకుంటాను'' అని హీరోయిన్ శివాత్మిక అన్నారు. 2023కి వీడ్కోలు పలుకుతూ 2024కి స్వాగతం పలుకుతున్న శివాత్మిక రాజశేఖర్ పంచుకున్న విశేషాలు...

■ మీ జీవితంలో 2023 ఎలా గడిచింది?

చెప్పాలంటే... 2023 నాకు గొప్పగా గడిచింది. చాలా విధాలుగా కలిసొచ్చింది. నా కెరీర్ స్టార్టింగ్‌లోనే మంచి ప్రాజెక్ట్స్‌లో భాగమయ్యాననే భావన కలిగింది. ఎప్పట్నుంచో నేను చేయాలనుకుంటున్న పనులు ఈ ఏడాది జరిగాయి. ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నాను. నన్ను నేను మెరుగుపరచుకోవడం కోసం కొత్త నైపుణ్యాలను నేర్చుకుంటున్నాను. కుటుంబం పరంగా కూడా బాగా గడిచింది. దేవుడి దయవల్ల, అదృష్టంగా 2023 నా జీవితంలో సంతోషంగా ముగిసింది.

■ ఈ ఏడాది మీ జీవితంలో జరిగిన చెడు ఘటనలు ఏవైనా ఉన్నాయా?

మంచి జరిగినట్లే... ప్రతి ఏడాది చెడు కూడా ఉంటుంది. అయితే కొత్త సంవత్సరాన్ని మొదలు పెట్టబోయే ఈ తరుణంలో వాటిని నేను గుర్తుతెచ్చుకోవాలనుకోవడం లేదు.

■ కొత్త ఏడాది కోసం మీరు తీసుకున్న కొత్త నిర్ణయాలు ఏంటి?

నా మనసును ఎక్కువగా ఫాలో అవుతూ వర్క్స్ చేస్తాను. ప్రతి అంశం గురించి ఎక్కువగా ఆలోచించకుండా ప్రస్తుత క్షణాన్ని ఆస్వాదించేలా జీవిస్తాను. ఇలా గత ఏడాదిలో ప్రయత్నించి సంతోషంగా జీవనం సాగించాను. ఈ ఏడాది కూడా ఇదే ఫాలో అవ్వాలనుకుంటున్నాను.

■ 2024 మీ జీవితంలో ఎలా ఉండాలనుకుంటున్నారు?

పెద్దగా అంచనాలు ఏమీ పెట్టుకోవడం లేదు. ఫ్లోను బట్టి ముందుకెళ్తాను. అయితే అన్నీ మంచి, గొప్ప అంశాలే జరగాలని కోరుకుంటున్నాను. సంతోషంగా, హాయిగా, ఆరోగ్యకరంగా గడవాలని ఆశిస్తున్నాను.

■ కొత్త ఏడాదిని ఎలా సెలబ్రేట్ చేసుకోబోతున్నారు?

కొత్త ఏడాది ఎప్పటిలానే అమ్మానాన్న(జీవిత, రాజశేఖర్), అక్క శివానీలతో హైదరాబాద్‌లోనే సెలబ్రేట్ చేసుకుంటున్నాను. నా స్నేహితులు, ఫ్యామిలీ ఫ్రెండ్స్‌ను కలుస్తాను.

వాస్తవ ఘటనలతో సర్కారు నౌకరి

ప్రముఖ సింగర్ సునీత కుమారుడు ఆకాష్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'సర్కారు నౌకరి'. గంగనమోని శేఖర్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో భావన హీరోయిన్‌గా నటించారు. ఆర్కే టెలీ షో బ్యానర్‌పై డైరెక్టర్ కె.రాఘవేంద్రరావు నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రెస్‌మీట్‌లో గంగనమోని శేఖర్ మాట్లాడుతూ– ''వాస్తవ ఘటనల స్ఫూర్తితో 90వ దశకం నేపథ్యంలో 'సర్కారు నౌకరి' రూపొందింది. ఇందులోని సందేశం, వినోదం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అన్నారు. ''సర్కారు నౌకరి'లో ప్రభుత్వ ఉద్యోగి పాత్రలో కనిపిస్తాను'' అన్నారు ఆకాష్. ''ఈ మూవీతో తెలుగులో పరిచయం కావడం సంతోషంగా ఉంది'' అన్నారు భావన.



● ఆకాష్, భావన



● బెల్లంకొండ సాయిశ్రీనివాస్

యాక్షన్ ఎంటర్‌టైనర్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'బీఎస్ఎస్ 10'(వర్కింగ్ టైటిల్). 'ఛీమ్లా నాయక్' మూవీ తర్వాత సాగర్ కె.చంద్ర దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ సినిమా కీలక షెడ్యూల్ పూర్తయింది. ''యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'బీఎస్ఎస్ 10'. భారీ బడ్జెట్‌తో అత్యున్నత సాంకేతిక విలువలతో ఈ సినిమా తెరకెక్కుతోంది. బెల్లంకొండ శ్రీనివాస్‌ని గతంలో ఎన్నడూ చూడని పవర్ ఫుల్ పాత్రలో సరికొత్తగా చూపించనున్నారు సాగర్ కె.చంద్ర. ఈ సినిమాలోని కీలకమైన షూటింగ్ షెడ్యూల్‌ను పూర్తి చేశాం. ఈ చిత్రంలో కొంతమంది ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ నెల 3న శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరీష్ కట్టా, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమెరా: ముఖేష్ జ్ఞానేష్.



● మృణాల్ ఠాకూర్



● లారెన్స్

లారెన్స్‌కు జోడీగా..?

హీరో రాఘవా లారెన్స్, హీరోయిన్ మృణాళ్ ఠాకూర్ జోడీ కట్టనున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. రాఘవా లారెన్స్ హీరోగా రమేష్ వర్మ దర్శకత్వంలో ఓ భారీ బడ్జెట్ ఫిల్మ్ తెరకెక్కనుందనే వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుందని టాక్. ఈ చిత్రంలో లారెన్స్‌కు జోడీగా మృణాళ్ కనిపిస్తారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో లేటెస్ట్‌గా వినిపిస్తోంది. అలాగే ఈ సినిమాకు 'శ్రీరామరక్ష' అనే టైటిల్‌ను కూడా అనుకుంటున్నారట మేకర్స్. కాగా ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



● శ్రీనాథ్, జీవీ ప్రకాశ్ కుమార్, ప్రణవ్, షాజ్ఞ, భువన్ రెడ్డి

దూడుం డుక్కుడుం బాగుంది

– జీవీ ప్రకాశ్ కుమార్

''ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు–500143' చిత్రంలోని 'దూడుం డుక్కుడుం..' పాట బాగుంది. ఈ సాంగ్‌కి క్లాసికల్ టచ్ ఇవ్వడం బాగా నచ్చింది. ఈ సినిమాలోని ఇతర పాటలు ఎలా ఉంటాయో అని ఆసక్తి పెరిగింది. ఈ చిత్రం తప్పకుండా మ్యూజికల్ హిట్ అవుతుంది'' అని సంగీత దర్శకుడు, నటుడు జీవీ ప్రకాశ్ కుమార్ అన్నారు. ప్రణవ్ సింగంపల్లి, షాజ్ఞ శ్రీ వేణున్ జంటగా శ్రీనాథ్ పులకురం దర్శకత్వం వహించిన చిత్రం 'ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు– 500143'. కొవ్వూరి అరుణ సమర్పణలో బ్లాక్ యాంట్ పిక్చర్స్‌పై భువన్ రెడ్డి కొవ్వూరి నిర్మించిన ఈ సినిమా రిలీజ్‌కి సిద్ధంగా ఉంది. కార్తీక్ రోడ్రిగ్జ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'దూడుం డుక్కుడుం..' పాటని జీవీ ప్రకాశ్ కుమార్ విడుదల చేశారు. శ్రీ సాయి కిరణ్ సాహిత్యం అందించిన ఈ పాటను మంగ్లీ పాడారు. ఈ చిత్రానికి కెమెరా: నిఖిల్ సురేంద్రన్, నేపథ్య సంగీతం: కమ్రాన్.